Follow: @ANNTELUGU

04-07-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 180 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మహా కథనానికి స్పందన

- అక్రమార్కుల కనుసన్నలోనే రెవెన్యూ అధికారులు.
- నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని రెవెన్యూ అధికారుల నుండి ఏ లెటర్ రాలేదు.
- గతంలోజారీ చేసిన అనుమతులు రద్దు చేస్తాం :ఏ సీ పీ హబీబ్ మున్నిసా.

02


టాప్ న్యూస్



## మెటాపై కేంద్రం సీరియస్

- వరుసగా 2సార్లు వార్నింగ్
- త్వరలో సమన్లు జారీ

02



## రేపు ఏమంటారో.. జగన్ కు మతిస్థిమితం లేదు

రాజధాని మాటలపై చంద్రబాబు ఫైర్

02

## కార్మికశాఖ ఇక శక్తి

- పేరు మార్చిన తెలంగాణ ప్రభుత్వం
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బాధ్యతలను నూతనంగా ఏర్పాటైన శక్తి శాఖకు బదిలీ

02



# జడ్పీటీసీ టు సీఎం



### ప్రజా ప్రతినిధిగా రేవంత్ రెడ్డి ప్రస్థానం ప్రారంభించి నేటితో 20 ఏళ్లు

శూన్యం నుంచి శిఖరం వరకు రేవంత్ రెడ్డి పొలిటికల్ జర్నీ

నేడు మిడ్జిల్ కు జననాయకుడు.. కృతజ్ఞత సభ

**హైదరాబాద్, మహా :** రాజకీయ రంగం ఒక దుర్ఘటమైన వైకుంఠపాళి. పాచికలు వేసేవాడు నేర్పరి కావాలి, అడ్డంకులు ఎదురైనప్పుడు అధిగమించే ధైర్యం ఉండాలి. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం పాలమూరు జిల్లా మిడ్జిల్ మండలం నుంచి ఒక సామాన్య జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం చేసిన రేవంత్ రెడ్డి, నేడు తెలంగాణ రాష్ట్రాన్ని శాసించే 'జననేత'గా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇది కేవలం ఒక రాజకీయ ప్రయాణం కాదు... ఆత్మవిశ్వాసానికి, అచంచల దీక్షకు, నిరంతర పోరాటానికి నిలువెత్తు నిదర్శనం. 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా బాధ్యతలు చేపట్టిన నాడే, ఆయన తన అంతరంగికులతో ఒక మాట అన్నారట.. నేను ఒకరోజు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అవుతాను" అని. విన్నవారు అప్పుడు దాన్ని ఒక అతిశయోక్తిగా, అతి సామాన్యమైన రాజకీయ ఆశయంగా కొట్టిపారేశారు. కానీ, కాలగర్భంలో దాగి ఉన్న ఆ మాట నేడు అక్షరాలా నిజమైంది.

మిగతా 2వ పేజీలో

# అప్పుల లెక్క తేలుద్దాం రండి

నేను చెప్పినవి అబద్ధాలైతే రాజీనామాకు సిద్ధం


కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌లకు మంత్రి జూపల్లి సవాల్

ప్రెస్ క్లబ్ లో పక్కన మూడు కుర్చీలతో మంత్రి

హరీష్ రావుది సొల్లుపురాణం.. పలాయనవాదం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర అప్పుల వ్యవహారంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు సవాల్ విసిరిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. తాను విసిరిన సవాల్‌కు కట్టుబడి ఉన్నానని, వెనకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బహిరంగ చర్చకు రావాలంటూ ఉదయం సవాల్ చేసిన ఆయన.. సాయంత్రం 5 గంటలకు ప్రెస్‌క్లబ్‌కు చేరుకుని ప్రతిపక్ష నేతల కోసం మూడు కుర్చీలు వేసి మరీ ఎదురుచూశారు. ప్రెస్‌క్లబ్‌లో జూపల్లి మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు నాలుగు పేజీల చొప్పున ఆధారాలతో సహా వాట్సాప్‌లో లేఖలు

మిగతా 2వ పేజీలో




## జూపల్లికి హరీష్ లేఖ

02

## తీరందాటిన నైరుతి రుతుపవనాలు

- దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షా లు, వరదలు



## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

కేసీఆర్, హరీశ్‌రావులకు భట్టి కౌంటర్ ఎటాక్

02








## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

**కేసీఆర్, హరీశ్‌రావులకు భట్టి కౌంటర్ ఎటాక్**

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. వివిధ మార్గాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారని మండిపడ్డారు. ఈ అప్పులపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని వెనక్కి తగ్గామని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక, వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్లను చెల్లించామన్నారు.



## జడ్పీటీసీ టు సీఎం

( మొదటి పేజీ తరువాయి )

ఆయన గమ్యం వైపు వేసిన ప్రతి అడుగు ఒక వ్యూహం, ప్రతి పలకరింపు ఒక బాధ్యత.

**అలుపెరుగని పోరాట యోధుడు**

స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా గెలిచి, ఆపై టీడీపీలో చేరి, కొడంగల్ గడ్డపై నుంచి తన రాజకీయ ముద్రను బలంగా వేసిన రేవంత్ రెడ్డి గమనం అంత సులభం కాదు. 20092014 మధ్యకాలంలో తెలంగాణ ఉద్యమ సెగలు, ఉమ్మడి రాష్ట్ర విభజన కల్లోలం.. ఇలా ప్రతి మలుపులోనూ ఆయన తనదైన శైలిలో దూసుకెళ్లారు. రాజకీయాల్లో గడ్డుకాలం ఎదురైనప్పుడు, నైతికతను వీడకుండా, కేసీఆర్ సర్కారు అవినీతిపై సింహంలా ఒంటరి పోరాటం చేసిన ధీశాలి ఆయన. జైలు గడపలు తొక్కినా, ఆశయాలు మాత్రం చెక్కుచెదరలేదు. రాజకీయాల్లో నాయకులు పార్టీలు మారడం సహజం. కానీ, పార్టీలు మారినా సంస్కారాన్ని, కృతజ్ఞతను వదలని వ్యక్తిత్వం రేవంత్ రెడ్డి సొంతం. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ నుంచి బయటకు వచ్చినప్పుడు ఆయన వ్యవహరించిన తీరు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. ఏనాడూ తనను తీర్చిదిద్దిన గురువును, పార్టీని విమర్శించని ఆయన రాజకీయ విజ్ఞత, ఆయన వ్యక్తిత్వంలోని పరిణతికి నిదర్శనం.

**ప్రజా పాలకుడిగా... ప్రగతి పథాన**

నేడు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన రేవంత్ రెడ్డి, ఒక పాలకుడిగానే కాకుండా, ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించే 'ప్రజా హృదయ చక్రవర్తి'గా నిలుస్తున్నారు. చెప్పిన మాటను నిలబెట్టుకోవడం, వాస్తవాలను ప్రజల ముందు ఉంచడం, అభివృద్ధికి చిత్తశుద్ధితో అడుగులు వేయడం ఆయన పంథా. ఏది దక్కినా అది శ్రమకు ప్రతిఫలం, ఏది జరిగినా అది ప్రజల ఆశీర్వాదం" అని నమ్మే రేవంత్ రెడ్డి ప్రయాణం, రేపటి తరం రాజకీయ నాయకులకు ఒక దిక్సూచి. పాలమూరు బిడ్డగా మొదలై, నేడు రాష్ట్ర భవితను నిర్దేశిస్తున్న ఈ 'ప్రజా పాలకుడి' ప్రస్థానం ఇంకా ఎన్నో అద్భుత ఘట్టాలకు సాక్షీభూతం కానుంది.

**నేడు మిడ్జిల్ లో కృతజ్ఞత సభ**

ప్రజా ప్రతినిధిగా తన ప్రస్థానం ప్రారంభించి నేటితో 20 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జడ్పీటీసీగా రాజకీయ జన్మనిచ్చిన మిడ్జిల్ లో కృతజ్ఞత సభను సీఎం నిర్వహించనున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఆత్మీయులతో ముచ్చటించనున్నారు. బహిరంగసభలో పాల్గొంటారు.

## మహా కథనానికి స్పందన

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ మహా :** కొండాపూర్ సర్వే నెంబర్ 60 లోని భూమిని చూపించి ప్రభుత్వ సర్వే నెంబర్ 59 లో అక్రమంగా బహుళంతస్తుల నిర్మాణాలు సాగిస్తున్న రియల్ మాఫియాపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపారు. "రెవెన్యూ అధికారుల బరితెగింపు " అనే కథనాన్ని మహా పత్రిక శుక్రవారం ప్రధాన శీర్షికగా ప్రచురించింది.. అత్త సొమ్ము.. అల్లుడు దానం అన్నచందంగా రు 5 కోట్ల రూపాయల విలువైన 223.1 స్క్వేర్ మీటర్ల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతుందని మే 11 నుండి మహా పత్రిక అక్షర పోరాటం చేస్తోంది.. ఆనాడు స్పందించిన రెవెన్యూ అధికారులు హడావిడిగా సర్వే చేయించి ప్రభుత్వ భూమిలోనే నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇది ప్రభుత్వ భూమిని బోర్డు పాతారు.. కాని భవనం చుట్టు ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు .. ఇదే అదునుగా భావించిన రియల్ మాఫియా లోపల, బయట పనులను యదేచ్ఛగా కొనసాగిస్తూనే ఉంది.. ప్రభుత్వ భూమని బోర్డు పెట్టారు.. ఆ బోర్డు ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోక పోవటం పై మతలబ్ ఏంటి..? కబ్జా చేసి నిర్మాణాలు సాగిస్తున్న అక్రమార్కులపై ఎటువంటి క్రిమినల్ కేసులు నమోదు చేయక పోవటానికి కారణం ఏమిటీ..?అలాగే జీ హెచ్ ఎం సీ టౌన్ ప్లానింగ్ నుండి జారీ చేసిన అనుమతులు రద్దు చేయటానికి లెటర్ రాస్తామని తెలిపిన రెవెన్యూ అధికారులు మాటలకే ..?ప్రజలను తప్పు దోవ పట్టించేందుకే ఆడుతున్న డ్రామానా..? అంటే అక్రమార్కులు భారీ మొత్తంలో ముడుపులు ముట్ట జెప్పటంతోనే నేటికీ లెటర్ రాయలేదనే విషయం టౌన్ ప్లానింగ్ అధికారుల మాటలను బట్టి తెట తెల్లమైంది .టౌన్ ప్లానింగ్ ఏ సీ పీ హబీబ్ మున్నిసా మహా ప్రతినిధి తో మాట్లాడుతూ సర్వే నెంబర్ 60 ని చూపించి నిర్మాణ అనుమతులు పొందారు.కాబట్టి గతంలో జారీ చేసిన నిర్మాణ అనుమతులు రద్దు చేస్తామన్నారు..అలాగే బిల్డింగ్ కూల్చివేత పై ఉన్నతాధికార్లతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.



## తీరందాటిన నైరుతి రుతుపవనాలు

**- దక్షిణాది రాష్ట్రాల్లో భారీగా వర్షా లు, వరదలు**

**హైదరాబాద్, మహా :** నైరుతి రుతుపవనాలు పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలు తప్ప దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు విస్తరించాయి. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తాజా అల్పపీడన ప్రభావంతోపాటు, ఇతర వాతావరణ పరిస్థితుల వల్ల రానున్న వారం రోజుల్లో దేశవ్యాప్తంగా, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. సున్నితమైన ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడడం, ఉరుములతో కూడిన గాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఐఎండీ ప్రకారం, ప్రస్తుతం దక్షిణ భారతదేశంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కొనసాగుతున్నాయి. కేరళ, కర్ణాటక, తెలంగాణ, తీరప్రాంత ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న వారం రోజుల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. కేరళ, కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణ, రాయలసీమలో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.





## మెటాపై కేంద్రం సీరియస్

- **వరుసగా 2సార్లు వార్నింగ్**
- **త్వరలో సమన్లు జారీ**

**ఢిల్లీ, మహా :** చిన్నారులపై లైంగిక వేధింపుల ప్రకటనలు, సైబర్ మోసాల ముప్పు నేపథ్యంలో సామాజిక మాధ్యమ దిగ్గజం మెటాపై కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకే వారంలో మెటాకు కేంద్రం వరుసగా రెండు సార్లు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. బాల బాలికలపై లైంగిక వేధింపుల కంటెంట్‌ను ప్రోత్సహించే విధంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వస్తున్న ప్రకటనల వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు మెటా సంస్థకు సమన్లు జారీ చేయాలని కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తన మంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ వివాదాస్పద ప్రకటనలపై మెటా నుంచి పూర్తి వివరణ కోరారు. అంతకుముందు వాట్సాప్‌లో కొత్త 'యూజర్‌నేమ్' ఫీచర్‌పై కేంద్రం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేసింది. ఈ కొత్త ఫీచర్ వల్ల ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఒకరి పేరుతో మరొకరు మోసాలకు పాల్పడే ముప్పు భారీగా పెరిగే అవకాశం ఉందని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై సంతృప్తికరమైన సంప్రదింపులు జరిగే వరకూ సదరు ఫీచర్‌ను నిలిపివేయాలని వాట్సాప్‌ను ఆదేశించింది.

## రేపు ఏమంటారో.. జగన్ కు మతిస్థిమితం లేదు

**రాజధాని మాటలపై చంద్రబాబు ఫైర్**

**కడప, మహా :** "అసెంబ్లీలో అమరావతిని రాజధానిగా ఒప్పుకొని, అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల నాటకమాడి, అధికారం పోయాక నిన్న విజయవాడ, నేడు 'మావిగన్' అంటూ మాట్లాడుతున్నారు. ఇది మతిస్థిమితం లేని రాజకీయానికి నిదర్శనం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు... వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆత్మాభిమానంతో ముడిపడిన రాజధాని వంటి సున్నితమైన అంశంపై బాధ్యతారహితంగా మాట్లాడటం దారుణమని అన్నారు. మొన్న మావిగన్ అన్నారు, నిన్న విజయవాడ అంటున్నారు... రేపు ఏమంటారో అంటూ చంద్రబాబు విమర్శించారు. ఇలాంటి మతిస్థిమితం లేని మాటలు, రాజకీయాలను తన జీవితంలో మొదటి సారి చూస్తున్నానని అన్నారు. తాము విశ్వసనీయతతో కూడిన రాజకీయం చేస్తామని, ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు రాజధానిపై గందరగోళం సృష్టిస్తుంటే, తాము మాత్రం రాయలసీమ ప్రజల దశాబ్దాల కలను నిజం చేస్తూ స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించి చేసి చూపిస్తున్నామని అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో, రాయలసీమ ప్రజల చిరకాల వాంఛ అయిన జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 2019, 2023 సంవత్సరాల్లో రెండుసార్లు ఇదే స్టీల్ ప్లాంట్‌కు మోసపూరిత శంకుస్థాపనలు చేశారని, కనీసం తట్ట మట్టి కూడా తీయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని అడ్డంకులను తొలగించి, పనులను ప్రారంభించామని తెలిపారు. "ఈరోజు జూలై 3వ తేదీ. ఈ డేట్ రాసి పెట్టుకోండి. సరిగ్గా 24 నెలల్లో, అంటే 2028 జూలై 3వ తేదీ నాటికి ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇది మా ప్రభుత్వ నిబద్ధత" అని చంద్రబాబు సభాముఖంగా హామీ ఇచ్చారు.



## అప్పుల లెక్క తేలుద్దాం రండి

( మొదటి పేజీ తరువాయి )

పంపినట్లు వెల్లడించారు. రాష్ట్ర అప్పు రూ. 8.21 లక్షల కోట్లు అని తాను లేఖలో స్పష్టంగా పేర్కొనగా, మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం అప్పు రూ. 4.17 లక్షల కోట్లేనంటూ తిరుగు లేఖ పంపారని విమర్శించారు. నేరుగా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను లేఖలో ప్రస్తావించిన అంశాలు అబద్ధాలని నిరూపించగలరా అని ఆయన సవాల్ చేశారు. పారిపోవడం తమ ఇంటావంటా లేదని ఆయన ఉద్ఘాటించారు. తాను చెప్పిన లెక్కలు అబద్ధమైతే పదవికి రాజీనామా చేసేందుకు సైతం సిద్ధమని జూపల్లి ప్రకటించారు. హరీశ్‌రావు రాసిన లేఖలో ఎలాంటి విషయం లేదని, తన ప్రశ్నలకు సమాధానం దాటవేస్తూ ఆయన 'సొల్లు పురాణం' చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వాస్తవాలు అంగీకరించి విలువలతో బతకాలని హితవు పలికారు.



## కార్మికశాఖ ఇక శక్తి

**పేరు మార్చిన తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్,మహా :** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో పరిపాలనా సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుత కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పేరును "డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్స్" (శక్తి)గా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బాధ్యతలను నూతనంగా ఏర్పాటైన శక్తి శాఖకు బదిలీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఇకపై యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి రానున్నాయి. రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఈ స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురానున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్, స్కిల్స్ యూనివర్సిటీల్లో కొనసాగుతున్న ప్రవేశాల ప్రక్రియకు ఈ నూతన సంస్కరణల వల్ల ఎలాంటి ఆటంకం కలగదని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.



## పినపాక నియోజకవర్గంలో వైద్య సేవలు మెరుగుపరచాలి

**: మంత్రి దామోదర రాజనర్సింహకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతి**

**హైదరాబాద్, మహా :** పినపాక నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో, నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి కీలక వినతిపత్రాలను సమర్పించారు. మణుగూరు ఏరియా ఆసుపత్రిపై ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోందని, పడకల వినియోగం 130 శాతానికి మించిందని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం ఉన్న 100 పడకల ఆసుపత్రిని 150 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని, అదనంగా 50 పడకల వార్డును ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ఐసీయూ సేవలు, అత్యవసర చికిత్సలు గిరిజన ప్రాంత ప్రజలకు మరింత చేరువవుతాయని ఆయన వివరించారు. గుండాల మండలం పూర్తిగా గిరిజన, అటవీ ప్రాంతమని, సమీప ఆసుపత్రులు సుమారు 60 నుంచి 78 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కావున, గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గా మార్చాలని కోరారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన మందులు, మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమర్పించిన వినతులపై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. మణుగూరు ఆసుపత్రి అప్‌గ్రేడేషన్, గుండాలలో సీహెచ్‌సీ ఏర్పాటు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని, తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు వెల్లడించారు.

## ముఖ్యమంత్రుల ఆస్తుల్లో దక్షిణాదిదే పైచేయి

**వేల కోట్ల నుంచి లక్షల వరకు.. సీఎంల సంపదలో భారీ వ్యత్యాసం**

**హైదరాబాద్, మహా:** దేశ రాజకీయాల్లో ముఖ్యమంత్రుల ఆస్తుల విలువ మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన వివరాల ఆధారంగా రూపొందించిన విశ్లేషణలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు అగ్రస్థానాల్లో నిలిచారు. భూముల విలువలు, కుటుంబ ఆస్తులు, వ్యాపార పెట్టుబడులు, స్థిరాస్తుల పెరుగుదల వంటి అంశాలు మొత్తం ఆస్తుల విలువను గణనీయంగా పెంచాయి. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని జాబితాల్లో పేర్లు, పదవులు కలగలిసిన సందర్భాలు కూడా కనిపిస్తున్నాయి.

**దక్షిణాది రాష్ట్రాల ఆధిపత్యం**

ఆస్తుల విలువ పరంగా దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నిలిచారు. ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ సుమారు ₹1,413 కోట్లు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ₹931 కోట్లతో రెండో స్థానంలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ ₹624 కోట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురి తర్వాత అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఉన్నారు.

**మధ్యస్థ ఆస్తులు కలిగిన ముఖ్యమంత్రులు**




నాగాలాండ్ ముఖ్యమంత్రి నీఫ్యూ రియో, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తదితరులు మధ్యస్థ స్థాయి ఆస్తులను ప్రకటించారు. వీరి ఆస్తుల్లో వ్యవసాయ భూములు, నివాస గృహాలు, వాణిజ్య స్థలాలు, బ్యాంకు డిపాజిట్లు ప్రధాన భాగంగా ఉన్నాయి.

**తక్కువ ఆస్తులు ప్రకటించిన ముఖ్యమంత్రులు**

జాబితాలో దిగువన గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్, మిజోరం ముఖ్యమంత్రి లాల్దుహోమా, మణిపూర్ ముఖ్యమంత్రి యుమ్నామ్ ఖేమ్‌చంద్ సింగ్, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సహా ఉన్నారు. వీరు ప్రకటించిన ఆస్తుల విలువ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది.


**ఆస్తుల పెరుగుదలకు కారణాలేమిటి?**

రాజకీయ నాయకుల ఆస్తుల్లో ఎక్కువ భాగం స్థిరాస్తుల రూపంలోనే ఉంటుంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విజయవాడ వంటి నగరాల్లో భూముల ధరలు గణనీయంగా పెరగడంతో ఆస్తుల విలువలు కూడా భారీగా పెరిగాయి. ఎన్నికల అఫిడవిట్లలో పేర్కొన్న మార్కెట్ విలువలే ఈ జాబితాకు ఆధారం కావడం గమనార్హం.



## జూపల్లికి హరీష్ లేఖ

**హైదరాబాద్, మహా :** పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తాము చేసిన అప్పులు రూ.4.17 లక్షల కోట్లు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ ద్వారా తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు తమపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. తాను మొదటి నుంచీ ఇదే చెప్తున్నానని, అసెంబ్లీలో సైతం ఈ విషయాన్నే చెప్పానన్నారు. కానీ.. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్ల పాలనలో రూ.4.5 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. తాము చేసిన అప్పులు, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపై చర్చించేందుకు ఎక్కడికి రావడానికైనా సిద్ధమని మరోసారి మంత్రి జూపల్లికి తెలిపారు. తాను చెప్పిన లెక్కలకు కట్టుబడి ఉంటానన్నారు. అప్పులపై ఎన్నిసార్లు వివరణ ఇచ్చినా కాంగ్రెస్ నేతల తీరు మారకపోవడం శోచనీయమన్నారు. గతంలో అసెంబ్లీ నిర్వహించిన సమయంలో.. అప్పటి వరకూ రూ.3.47 లక్షల కోట్ల అప్పు తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డినే స్వయంగా ఒప్పుకున్నారని గుర్తు చేశారు. ఎంత చెప్పినా.. జూపల్లి తీరు పూటకో సవాల్.. రోజుకో అడ్రస్ లా ఉందని హరీష్‌రావు అసహనం వ్యక్తం చేశారు.



ఆర్థిక ఇబ్బందులు భరించలేక

## రైలు కిందపడి దంపతులు ఆత్మహత్య

**హైదరాబాద్, మహా :** రైలు కిందపడి దంపతులు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి ఘట్కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది, ఆర్థిక ఇబ్బందులు తాళలేక, కట్టుకున్న భార్యతో కలిసి ఓ భర్త రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.క్షణికావేశంలో వారు తీసుకున్న ఈ నిర్ణయం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్య పేట గ్రామానికి చెందిన రవికుమార్ (32), శిరీష (28) దంపతులు. గత కొంతకాలంగా వీరు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. అప్పుల భారం పెరగడం, వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో జీవితంపై విరక్తి చెందారు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పైకి చేరుకుని, వేగంగా వస్తున్న రైలు కింద పడి ప్రాణాలు విడి చారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను పరిశీలిం చారు. మృతుల వద్ద లభించిన ఆధారాల ఆధారంగా వారు వరంగల్ జిల్లాకు చెందిన దంపతులు గా గుర్తించి, సమా చారాన్ని వారి కుటుంబ సభ్యులకు అందించారు.

# విద్యుత్ వెలుగుల్లో భారత్..!

- **ప్రపంచంలో రోజుకు సగటున 21 గంటల విద్యుత్ సరఫరా.**

**1హైద్రాబాద్, మహా.** ఒకప్పుడు తరచూ విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న భారత్... ఇప్పుడు విద్యుత్ సరఫరాలో ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి చేరుకుంది. దేశవ్యాప్తంగా ఉత్పత్తి సామర్థ్యం పెరగడం, జాతీయ విద్యుత్ గ్రిడ్ బలోపేతం కావడం, గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ అనుసంధానం విస్తరించడం, పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ పెట్టుబడులు పెరగడం వంటి పరిణామాలతో విద్యుత్ రంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశంలో రోజుకు సగటున 21 గంటల మేర విద్యుత్ అందుబాటులో ఉండడం, దేశ విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి నిదర్శనంగా నిలుస్తోంది.



**విద్యుత్ రంగంలో భారత్ కొత్త మైలురాయి**

ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు ఇప్పటికీ నిరంతర విద్యుత్ సరఫరా సమస్యను ఎదుర్కొంటున్నాయి. దక్షిణ సూడాన్‌లో సగటున రోజుకు నాలుగు గంటలు, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఆరు గంటలు, హైతీలో ఎనిమిది గంటలు, నైజీరియాలో పది గంటలు మాత్రమే విద్యుత్ అందుబాటులో ఉంటోంది. పాకిస్థాన్‌లో సగటున పదహారు గంటలు, బంగ్లాదేశ్‌లో ఇరవై గంటల విద్యుత్ లభిస్తుండగా, భారత్ రోజుకు సగటున 21 గంటల విద్యుత్ సరఫరాతో మరింత మెరుగైన స్థాయిలో నిలవడం విశేషం.

**అభివృద్ధి చెందిన దేశాల దిశగా అడుగులు**

ప్రపంచంలోని అత్యంత విశ్వసనీయ విద్యుత్ వ్యవస్థలు కలిగిన సింగపూర్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా వంటి దేశాల్లో దాదాపు 24 గంటల విద్యుత్ అందుబాటులో ఉంటుంది. చైనాలో 23.5 గంటలు, బ్రెజిల్‌లో 23 గంటలు, ఈజిప్టులో 22 గంటల సరఫరా నమోదవుతోంది. ఈ జాబితాలో భారత్ కూడా వేగంగా ముందుకు సాగుతూ, విద్యుత్ రంగంలో తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుతోంది.

**గ్రామం నుంచి మహానగరం వరకు వెలుగుల విస్తరణ**

దేశంలోని ప్రతి గ్రామానికి విద్యుత్ చేరవేయాలనే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా విద్యుత్ మౌలిక వసతులపై భారీ పెట్టుబడులు పెట్టారు. కొత్త సబ్‌స్టేషన్లు, అధిక సామర్థ్య ప్రసార లైన్లు, ఆధునిక పంపిణీ వ్యవస్థలు, స్మార్ట్ మీటర్లు, డిజిటల్ పర్యవేక్షణ వంటి చర్యలతో విద్యుత్ సరఫరా నాణ్యత క్రమంగా మెరుగుపడుతోంది. పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగం, గృహ వినియోగం—అన్ని రంగాలకు స్థిరమైన విద్యుత్ అందించడం దేశ ఆర్థికాభివృద్ధికి బలంగా మారుతోంది.

**పునరుత్పాదక ఇంధనంలో భారత్ దూసుకుపోతోంది**

సౌర, పవన, జల విద్యుత్ రంగాల్లో భారత్ ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న దేశాల్లో ఒకటిగా నిలిచింది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి పెరగడం వల్ల విద్యుత్ లభ్యత మరింత బలోపేతం అవుతోంది. ఒకవైపు బొగ్గు ఆధారిత ఉత్పత్తి కొనసాగుతుండగా, మరోవైపు హరిత ఇంధన సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని దేశం ముందుకు సాగుతోంది.

**ఆర్థికాభివృద్ధికి విద్యుత్ బలమైన ఆధారం**

నిరంతర విద్యుత్ సరఫరా పరిశ్రమల ఉత్పాదకతను పెంచడమే కాకుండా పెట్టుబడులను ఆకర్షించడంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. సమాచార సాంకేతిక రంగం, తయారీ పరిశ్రమలు, డేటా సెంటర్లు, మెట్రో నగరాల మౌలిక వసతులు, వ్యవసాయ రంగం—అన్నింటికీ విశ్వసనీయ విద్యుత్ సరఫరా ప్రధాన బలంగా నిలుస్తోంది. విద్యుత్ అందుబాటు పెరగడం వల్ల చిన్న పరిశ్రమల నుంచి భారీ పారిశ్రామిక యూనిట్ల వరకు ఉత్పత్తి సామర్థ్యం మెరుగుపడుతోంది.

**ఇక లక్ష్యం... నిరంతర 24 గంటల విద్యుత్**

రోజుకు సగటున 21 గంటల విద్యుత్ అందుబాటుతో భారత్ ఇప్పటికే అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే మెరుగైన స్థాయిలో నిలిచింది. ఇప్పుడు దేశ లక్ష్యం ప్రతి ఇంటికి, ప్రతి గ్రామానికి, ప్రతి పరిశ్రమకు నాణ్యమైన 24 గంటల నిరంతర విద్యుత్ అందించడం. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ రంగాల్లో జరుగుతున్న పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత వినియోగం, పునరుత్పాదక ఇంధన విస్తరణతో ఆ లక్ష్యం మరింత చేరువవుతోంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత ప్రయాణంలో విద్యుత్ రంగం అత్యంత కీలకమైన ఆధార స్తంభంగా నిలుస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# ఎల్‌నినో ప్రభావంపై కేంద్రం అప్రమత్తం

- **వర్షా భావ పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్ష.**

**ఢిల్లీ, మహా**: దేశంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎల్‌నినో ప్రభావంతో కొన్ని రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత నైరుతి రుతుపవనాల పరిస్థితి, ఖరీఫ్ పంటలపై పడే ప్రభావం, తాగునీటి లభ్యత, జలవనరుల నిర్వహణ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో దేశవ్యాప్తంగా రుతుపవనాల పురోగతిని కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం లోటు కొనసాగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు, గ్రామీణ ప్రాంతాలు, తాగునీటి సరఫరాపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. జలవనరుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ఉన్న పెద్ద, చిన్న జలాశయాలు, చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అమిత్ షా ఆదేశించారు. నీటి నిల్వలు తగ్గే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం పెంచి నీటి నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంపై వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమావేశంలో వెల్లడైంది. తక్కువ వర్షపాతం నమోదయ్యే జిల్లాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ చర్యలు, విత్తనాలు, ఎరువుల అందుబాటు వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటికే సూచనలు జారీ చేసినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. దేశంలోని వాతావరణ పరిస్థితులు, జలవనరుల లభ్యత, వ్యవసాయ అవసరాలను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే సవాళ్లను ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు కొనసాగించాలని సమావేశంలో నిర్ణయించారు.

# నిమిషాల్లో భవన అనుమతి

- **'బిల్ట్‌నౌ'తో తెలంగాణలో నిర్మాణ రంగానికి డిజిటల్ విప్లవం!**
- **66 అంతస్తుల భవన దరఖాస్తుకు 91 సెకన్లలో గ్రీన్‌సిగ్నల్.**


**హైదరాబాద్, మహా :** భవన నిర్మాణ అనుమతి అంటే ఒకప్పుడు నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఫైళ్లు ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కు మారుతూ ఆలస్యాలు, అభ్యంతరాలు, సాంకేతిక పరిశీలనలు, అధికారుల ఆమోదాలు పూర్తయ్యే వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేని పరిస్థితి ఉండేది. కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బిల్ట్‌నౌ' డిజిటల్ వ్యవస్థ ఆ పరిస్థితిని పూర్తిగా మార్చేస్తోంది. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలో 66 అంతస్తుల భారీ భవన నిర్మాణ దరఖాస్తును కేవలం ఒక నిమిషం 31 సెకన్లలో పరిశీలించి పూర్తి చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అంతేకాదు, ప్రారంభమైన ఏడాదిలోనే 61,426 భవన నిర్మాణ అనుమతులు, 6,739 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ కావడం ఈ వ్యవస్థ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

**భవన అనుమతుల వ్యవస్థలో విప్లవాత్మక మార్పు.**

నగరాభివృద్ధిలో భవన నిర్మాణ అనుమతులు అత్యంత కీలకమైన అంశం. గతంలో నిర్మాణదారులు మున్సిపల్ కార్యాలయాలు, హెచ్ఎండీఏ, అగ్నిమాపక శాఖ, పర్యావరణ విభాగం, నీటి సరఫరా, విద్యుత్ తదితర విభాగాల అనుమతుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. ఒక చిన్న సాంకేతిక లోపం కనిపించినా మొత్తం ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి ప్రారంభమయ్యేది. ఈ ఆలస్యాల కారణంగా నిర్మాణ వ్యయం పెరగడం, పెట్టుబడిదారులు వెనక్కి తగ్గడం, ప్రాజెక్టులు నిలిచిపోవడం వంటి సమస్యలు సాధారణమయ్యాయి.'బిల్ట్‌నౌ' అమలుతో ఈ సంప్రదాయ విధానానికి ముగింపు పలికే ప్రయత్నం జరిగింది. దరఖాస్తు నుంచి అనుమతి వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ వేదికపైకి తీసుకురావడంతో సమయం గణనీయంగా తగ్గింది.

**91 సెకన్లలో 66 అంతస్తుల భవన పరిశీలన.**

66 అంతస్తుల భవనం అంటే సాధారణ నిర్మాణం కాదు. భూవినియోగం, ఎత్తు పరిమితులు, రోడ్ల వెడల్పు, పార్కింగ్, అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, నిర్మాణ నిబంధనలు వంటి అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది.




'బిల్ట్‌నౌ'లో ఈ పరిశీలనలో ఎక్కువ భాగాన్ని కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ పరిశీలన, ఆటోమేటెడ్ రూల్ ఇంజిన్ ద్వారా నిర్వహించే విధంగా రూపొందించారు. దరఖాస్తుదారు సమర్పించిన డిజిటల్ మ్యాప్‌లు, నిర్మాణ ప్రణాళికలను వ్యవస్థ నిబంధనలతో పోల్చి వెంటనే ఫలితాన్ని అందిస్తుంది. అందుకే భారీ ప్రాజెక్టు దరఖాస్తు కూడా కేవలం 91 సెకన్లలో ప్రాథమిక పరిశీలన పూర్తిచేయగలిగింది.

**సంవత్సరంలోనే వేలాది అనుమతులు.**

బిల్ట్‌నౌ అమలులోకి వచ్చిన తర్వాత ఒకే ఏడాదిలో 61,426 భవన నిర్మాణ అనుమతులు జారీ కావడం విశేషం. అదేవిధంగా 6,739 ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు కూడా జారీ అయ్యాయి. అంటే భవన నిర్మాణం పూర్తయిన తర్వాత వినియోగానికి అవసరమైన తుది ధ్రువీకరణ ప్రక్రియ కూడా వేగవంతమైందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంఖ్యలు కేవలం సాంకేతిక విజయం మాత్రమే కాదు. నిర్మాణ రంగంలో ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందని కూడా సూచిస్తున్నాయి.

**రియల్ ఎస్టేట్ రంగానికి భారీ ఊరట**

రియల్ ఎస్టేట్ రంగంలో సమయమే అత్యంత విలువైన పెట్టుబడి. అనుమతుల ఆలస్యం వల్ల బ్యాంకు వడ్డీలు పెరగడం, నిర్మాణ వ్యయం అధికం కావడం, గృహ కొనుగోలుదారులకు ఇళ్ల అప్పగింత ఆలస్యం కావడం వంటి సమస్యలు తరచూ ఎదురయ్యేవి. ఇప్పుడు అనుమతులు వేగంగా లభిస్తే ప్రాజెక్టులు నిర్ణీత గడువులో పూర్తయ్యే అవకాశం పెరుగుతుంది. దీనివల్ల నిర్మాణ వ్యయం తగ్గడంతో పాటు పెట్టుబడిదారుల విశ్వాసం కూడా బలోపేతం అవుతుంది. హైదరాబాద్‌ను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు మరింత ఆకర్షణీయ కేంద్రంగా మార్చడంలో ఈ విధానం కీలక పాత్ర పోషించే అవకాశముంది.

**సవాళ్లు కూడా ఉన్నాయి**

అయితే వేగమే విజయానికి కొలమానం కాదని పట్టణ ప్రణాళిక నిపుణులు గుర్తుచేస్తున్నారు. అత్యంత వేగంగా అనుమతులు జారీ చేసే సమయంలో భద్రతా ప్రమాణాలు, నిర్మాణ నాణ్యత, అగ్నిమాపక నిబంధనలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ఎలాంటి రాజీ జరగకూడదు. వ్యవస్థలో సమర్పించే సమాచారం పూర్తిగా సరిగ్గా ఉంటేనే ఆటోమేటెడ్ పరిశీలన సమర్థవంతంగా పనిచేస్తుంది. తప్పుడు వివరాలు సమర్పిస్తే భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

**తెలంగాణకు జాతీయ గుర్తింపు వచ్చే అవకాశమా?**

డిజిటల్ పాలనలో ఇప్పటికే తెలంగాణ అనేక సంస్కరణలు అమలు చేసింది. ఇప్పుడు భవన నిర్మాణ అనుమతులను కూడా పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో వేగంగా జారీ చేయడం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది. ముఖ్యంగా వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ వంటి మహానగరంలో నిర్మాణ అనుమతులు సులభతరం కావడం పెట్టుబడులు, ఉపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడుతుంది.

**పారదర్శకతకు పెద్దపీట**

పాత వ్యవస్థలో ఫైళ్లు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవడం దరఖాస్తుదారులకు కష్టంగా ఉండేది. కొన్నిసార్లు అవసరానికి మించిన ఆలస్యాలు, మధ్యవర్తుల ప్రమేయంపై విమర్శలు కూడా వచ్చేవి.డిజిటల్ విధానంలో ప్రతి దశ ఆన్‌లైన్‌లో నమోదవుతుంది. ఎవరు ఎప్పుడు ఫైల్‌ను పరిశీలించారు, ఏ కారణంతో అభ్యంతరం తెలిపారు, తదుపరి దశ ఏమిటి వంటి వివరాలు స్పష్టంగా కనిపిస్తాయి. దీంతో పారదర్శకత పెరగడమే కాకుండా జవాబుదారీతనం కూడా మెరుగుపడుతోంది.

# డిజిటల్ ట్విన్‌తో భవిష్యత్ హైదరాబాద్

- **2050 మహా ప్రణాళికకు శ్రీకారం!**
- **11 వేల చ.కి.మీ. ఒకే డిజిటల్ మ్యాప్‌లో నగరాభివృద్ధికి హెచ్ఎండీఏ మెగా ప్లాన్.**

**హైదరాబాద్, మహా**: హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి భవిష్యత్ మహానగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మక అడుగు వేస్తోంది. 2050 నాటి నగర అవసరాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ రూపొందిస్తున్న కొత్త మాస్టర్‌ప్లాన్‌లో అత్యాధునిక త్రిమితీయ డిజిటల్ ట్విన్ సాంకేతికతను వినియోగించనుంది. దాదాపు 11 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రోడ్లు, భవనాలు, చెరువులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ నెట్‌వర్క్, ట్రాఫిక్, భూవినియోగం వంటి అన్ని వివరాలను ఒకే డిజిటల్ వేదికపై మ్యాపింగ్ చేసి, రియల్‌టైమ్ సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నది లక్ష్యం. ఇందుకోసం త్వరలోనే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ నోటిఫికేషన్ విడుదల చేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమవుతోంది.

**2050 మాస్టర్‌ప్లాన్ అంటే ఏమిటి?**

హైదరాబాద్ ఇప్పటివరకు 2031 మాస్టర్‌ప్లాన్ ఆధారంగా అభివృద్ధి చెందుతోంది. అయితే నగర జనాభా, పరిశ్రమలు, ఐటీ రంగం, మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తుండటంతో 2050 వరకు అవసరమయ్యే అభివృద్ధి దిశను ముందుగానే నిర్దేశించేందుకు హెచ్ఎండీఏ సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తోంది. ఇందులో భూవినియోగం మాత్రమే కాకుండా రవాణా, పర్యావరణం, ఆర్థికాభివృద్ధి, వాతావరణ మార్పులు, భవిష్యత్ నగర విస్తరణ వంటి అన్ని అంశాలను ఒకే ప్రణాళికలో సమన్వయం చేయనున్నారు.

**మూడు స్తంభాలపై భవిష్యత్ హైదరాబాద్.**

మొదటిది సమగ్ర రవాణా ప్రణాళిక. నగరంలో మెట్రో, ఎంఎంటీఎస్, బస్సులు, రహదారులు, సైకిల్ ట్రాక్‌లు, పాదచారుల మార్గాలను సమగ్రంగా అనుసంధానించే విధంగా రూపకల్పన చేస్తున్నారు. రెండవది బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళిక. ఇందులో మూసీ నది పునరుద్ధరణ, చెరువుల పరిరక్షణ, పార్కులు, అటవీ ప్రాంతాలు, వర్షపు నీటి పారుదల, వరద నియంత్రణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.మూడవది ఆర్థికాభివృద్ధి ప్రణాళిక. ఐటీ, తయారీ, లాజిస్టిక్స్, సేవారంగం, కొత్త పారిశ్రామిక మండలాలు, భవిష్యత్ నగర అభివృద్ధి ప్రాంతాల కోసం దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందిస్తున్నారు.

**డిజిటల్ ట్విన్ అంటే ఏమిటి?**

డిజిటల్ ట్విన్ అనేది నగరానికి సంబంధించిన పూర్తి డిజిటల్ ప్రతిరూపం. నిజమైన నగరంలో ఏమి జరుగుతుందో అదే సమాచారం కంప్యూటర్‌లో త్రిమితీయ రూపంలో కనిపిస్తుంది. ఎక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంది, ఎక్కడ నీటి పైప్ పగిలింది, ఏ ప్రాంతంలో వరద ప్రమాదం ఉంది, ఏ రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది, ఎక్కడ కొత్త నిర్మాణాలు జరుగుతున్నాయి వంటి వివరాలు రియల్‌టైమ్‌లో అధికారులు పరిశీలించగలుగుతారు.ప్రపంచంలోని సింగపూర్, లండన్, దుబాయ్ వంటి నగరాల్లో ఇప్పటికే ఈ సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇప్పుడు అదే తరహా విధానాన్ని హైదరాబాద్‌లో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

**11 వేల చ.కి.మీ. డిజిటల్ మ్యాపింగ్.**

ప్రతిపాదిత ప్రాజెక్టులో దాదాపు 11 వేల చదరపు కిలోమీటర్ల పరిధిని డిజిటల్‌గా మ్యాపింగ్ చేయనున్నారు. ఇందులో భవనాల ఎత్తు, రహదారుల వెడల్పు, ఫ్లైఓవర్లు, డ్రైనేజీ లైన్లు, తాగునీటి నెట్‌వర్క్, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, చెరువులు, నదులు, ప్రభుత్వ భూములు, పార్కులు, పరిశ్రమలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, భూవినియోగ నమూనాలు వంటి వేలాది అంశాలను ఒకే వేదికపై సమీకరించనున్నారు. దీని ద్వారా నగర ప్రణాళిక శాస్త్రీయంగా మారనుంది.

**రవాణా రంగంలో భారీ మార్పులు.**

2050 నాటికి హైదరాబాద్ మహానగర ప్రాంతంలో రవాణా మౌలిక సదుపాయాల కోసం సుమారు నాలుగు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరమవుతాయని సమగ్ర రవాణా ప్రణాళిక అంచనా వేసింది.మెట్రో రైలు నెట్‌వర్క్‌ను సుమారు 556 కిలోమీటర్ల వరకు విస్తరించడం, ఎంఎంటీఎస్‌ను 336 కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేయడం, కొత్త రహదారులు, బస్ రాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థ, ఫ్లైఓవర్లు, రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, మూసీపై కొత్త వంతెనలు నిర్మించడం వంటి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి.

**రియల్ ఎస్టేట్ రంగానికి ఊతం**

కొత్త మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వస్తే రియల్ ఎస్టేట్ రంగానికి కూడా స్పష్టత లభించే అవకాశం ఉంది. ఏ ప్రాంతంలో భవిష్యత్‌లో పరిశ్రమలు వస్తాయి, ఎక్కడ నివాస ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి, ఎక్కడ వాణిజ్య మండలాలు ఏర్పడతాయి, ఎక్కడ మెట్రో విస్తరణ ఉంటుంది వంటి అంశాలు ముందుగానే తెలిసే అవకాశం ఉండటంతో పెట్టుబడిదారులు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవచ్చు.ఇంత పెద్ద డిజిటల్ వ్యవస్థను విజయవంతంగా నిర్వహించాలంటే నిరంతర డేటా నవీకరణ, సైబర్ భద్రత, వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, నాణ్యమైన భౌగోళిక సమాచారం, సాంకేతిక నిపుణుల అందుబాటు వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. ఒకసారి వ్యవస్థ రూపొందించిన తర్వాత దాన్ని నిరంతరం నవీకరించకపోతే ప్రయోజనం తగ్గే అవకాశం ఉందని పట్టణ ప్రణాళిక నిపుణులు సూచిస్తున్నారు

**వరదలు, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారమా?**

ఇటీవలి సంవత్సరాల్లో హైదరాబాద్‌లో భారీ వర్షాల సమయంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా కనిపించాయి. డిజిటల్ ట్విన్ ద్వారా వర్షపాతం, డ్రైనేజీ సామర్థ్యం, నీటి ప్రవాహం, తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలు వంటి వివరాలను ముందుగానే విశ్లేషించి వరదల ప్రభావాన్ని తగ్గించే ప్రణాళికలు రూపొందించవచ్చు.అదేవిధంగా ట్రాఫిక్ రద్దీని ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయ రహదారులు, సిగ్నల్ సమన్వయం, ప్రజారవాణా ప్రణాళికలను మెరుగుపరచే అవకాశం ఉంటుంది.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ.

**అమరావతి , మహా** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. విజయవాడలోని లోక్ భవన్‌లో సాయంత్రం జరిగిన ఈ భేటీ అత్యంత ఆత్మీయ వాతావరణంలో సాగింది. రాష్ట్రానికి సంబంధించిన ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిణామాలపై ఇరువురి మధ్య కీలక, ఫలప్రదమైన చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం అనంతరం గవర్నర్ మార్గదర్శకత్వం, ఆయన అందించిన ఆతిథ్యం పట్ల పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ భేటీలో ప్రధానంగా సామాజిక మాధ్యమాల్లో కొందరు వ్యక్తులు పాల్పడుతున్న వ్యక్తిత్వ హననం, అసత్య ప్రచారాల తీరును పవన్ కల్యాణ్ గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. సమాజంలో ఇలాంటి విపరీత ధోరణులు పెరిగిపోతుండటం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాలను అరికట్టేందుకు ప్రభుత్వం తరపున చట్టపరంగా తీసుకోబోయే కఠిన చర్యలను



గవర్నర్‌కు వివరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తేనే ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేయగలమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు సమాచారం.ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విపరీత ధోరణులు శృతిమించాయి. కొందరు తమకు నచ్చకపోతే ఇష్టమొచ్చిన రీతిలో అసభ్యకరమైన పోస్టులు పెట్టడం, బూతులు తిట్టడం వంటి అతి పోకడలకు పాల్పడుతున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్.. ఇలాంటి వారిని చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని ఇటీవల అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆకతాయిల ఆటకట్టించేందుకు ప్రభుత్వం తీసుకోబోయే కఠిన చర్యలపై ఆయన గవర్నర్‌కు వివరించినట్లు తెలుస్తోంది. గవర్నర్‌తో సమావేశానికి ముందు పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సైబర్ క్రైమ్ ఐజీ, యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ 'ఈగల్' విభాగం చీఫ్ ఆకే రవికృష్ణతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'ఈగల్' విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ ఆయనకు లాంఛనంగా సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల మహమ్మారిని అణచివేసేందుకు పోలీస్ శాఖ తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యలను ఉపముఖ్యమంత్రికి వివరించారు. ఇదే క్రమంలో సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన పోస్టులు పెట్టేవారు, ట్రోలింగ్‌కు పాల్పడే వారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న చర్యల గురించి ఐజీ ఆయనకు సవివరంగా తెలియజేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని ఈ సమావేశాల ద్వారా స్పష్టమవుతోంది.

# పీఎఫ్ ఖాతాల్లో రూ.9,330 కోట్లు

**ఢిల్లీ, మహా :** ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారుల కోసం కేంద్రం కొత్త ఈపీఎఫ్ స్కీమ్ 2026ను అమల్లోకి తీసుకొచ్చింది. నిబంధనలను సరళీకరించి, సేవలను పూర్తిగా డిజిటలైజ్ చేయడమే దీని లక్ష్యం. అయితే మరోవైపు దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల నిరుపయోగ ఈపీఎఫ్ ఖాతాల్లో రూ.9,330 కోట్లకు పైగా కార్మికుల సొమ్ము క్లెయిమ్ కాకుండా నిలిచిపోయినట్లు ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చింది. ఈ వివరాలను ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) వెల్లడించింది. 2026 మార్చి 31 నాటికి 30.91 లక్షల ఇనాపరేటివ్ ఖాతాల్లో రూ.9,330 కోట్లు ఉన్నాయని ఈపీఎఫ్ఓ తెలిపింది. 2025తో పోలిస్తే నిరుపయోగ ఖాతాలు సుమారు 92 వేల మేర, క్లెయిమ్ కాని మొత్తం రూ.851 కోట్లు తగ్గినప్పటికీ, ఇప్పటికీ భారీగా కార్మికుల సొమ్ము నిలిచిపోయి ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ మొత్తంతో దాదాపు మూడు కొత్త ఐఐటీలను నిర్మించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే 'ఉడాన్' పథకం లేదా ఆయుష్మాన్ భారత్‌కు కేటాయించే వార్షిక నిధులతో సమాన స్థాయిలో ఈ మొత్తం ఉందని పేర్కొంటున్నారు. గత ఐదేళ్ల నిరుపయోగ ఖాతాల పూర్తి వివరాలను కోరిన ఆర్టీఐకి ఈపీఎఫ్ఓ పూర్తిస్థాయి సమాచారం ఇవ్వలేదు. ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు, ఆటో సెటిల్‌మెంట్ వివరాలు, రూ.5 లక్షలకు పైగా నిల్వలున్న ఖాతాల సమాచారాన్ని వెల్లడించేందుకు కూడా నిరాకరించింది. కొత్త సంస్కరణలు అమలవుతున్నప్పటికీ, కార్మికుల కష్టార్జితం వారికే చేరే ప్రక్రియలో ఇంకా అనేక సవాళ్లు కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# రెండుదశాబ్దాల స్ఫూర్తి రేవంత్ రెడ్డి



రాజకీయాల్లో పదవులు గెలవడం గొప్ప కావచ్చు. కానీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం అంతకంటే గొప్పది. అధికారంలోకి రావడం ఒక విజయం కావచ్చు. కానీ ఓటమిని విజయానికి సోపానంగా మార్చుకుని తిరిగి శిఖరాన్ని అధిరోహించడం అసాధారణం. అలాంటి అసాధారణ రాజకీయ ప్రస్థానానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిలువెత్తు ఉదాహరణ. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో రేవంత్ రెడ్డి నాయకత్వం పార్టీకి కొత్త ఊపిరి పోసింది. నిర్వీర్యంగా మారిందనే విమర్శలు ఎదుర్కొన్న కాంగ్రెస్‌లో కార్యకర్తలకు కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ శ్రేణులను చైతన్యపరిచింది. అధికారానికి ప్రత్యామ్నాయంగా నిలబెట్టి, చివరకు ప్రజల తీర్పుతో అధికార పీఠాన్ని అధిరోహించే స్థాయికి చేర్చింది. అందుకే "కాంగ్రెస్‌కు ఆక్సిజన్ అందించిన నాయకుడు" అనే విశేషణం ఆయన రాజకీయ ప్రస్థానంతో ముడిపడి వినిపిస్తోంది. జూలై 4. ఒక తేదీ మాత్రమే కాదు. ఒక రాజకీయ జన్మదినం. ఒక ప్రజా నాయకుడి తొలి అడుగు. ఒక చరిత్రకు నాంది. 2006లో మిడ్జిల్ జడ్పీటీసీ సభ్యుడిగా మొదలైన ప్రయాణం... కేవలం 17 ఏళ్లలో తెలంగాణ ముఖ్యమంత్రి పదవిని చేరుకుంది. జూలై 4తో ప్రజా ప్రతినిధిగా ఇరవై ఏళ్లు పూర్తి చేసుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రస్థానం... కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు సాగిన అరుదైన రాజకీయ గాథ.

1969 నవంబర్ 8న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ప్రస్తుత నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లిలో జన్మించిన రేవంత్ రెడ్డి, విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై స్పందించారు. ఉద్యమాలే ఆయనకు నాయకత్వాన్ని నేర్పాయి. ప్రజల మధ్యే రాజకీయాన్ని అర్థం చేసుకున్నారు. ప్రజలతోనే నడుస్తూ నాయకుడిగా ఎదిగారు. మిడ్జిల్ జడ్పీటీసీ... స్థానిక సంస్థల ఎమ్మెల్సీ... కొడంగల్ ఎమ్మెల్యే... మల్కాజిగిరి ఎంపీ... టీపీసీసీ అధ్యక్షుడు... తెలంగాణ ముఖ్యమంత్రి. ఇవి కేవలం పదవులు కావు. ప్రతి మెట్టు వెనుక పోరాటం ఉంది. ప్రతి విజయానికి వెనుక ప్రజల విశ్వాసం ఉంది. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం ఉంది.


2018లో కొడంగల్‌లో ఎదురైన ఓటమి చాలా మందికి రాజకీయ ముగింపుగా కనిపించింది. కానీ రేవంత్ రెడ్డికి అది కొత్త ప్రారంభం అయింది. ఏడాది తిరగకముందే మల్కాజిగిరి నుంచి లోక్‌సభకు ఘన విజయం సాధించారు. ఆ తరువాత తెలంగాణ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి, నిరాశలో ఉన్న కార్యకర్తల్లో కొత్త ఆశ నింపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని పునర్వ్యవస్థీకరించారు. అధికారానికి ప్రత్యామ్నాయంగా నిలబెట్టి, చివరకు కాంగ్రెస్‌ను విజయతీరానికి చేర్చారు. అందుకే ఆయనను కాంగ్రెస్‌కు కొత్త ఊపిరి నింపిన సారథిగా పలువురు అభివర్ణిస్తారు. జడ్పీటీసీగా ఉన్నప్పుడు ఒక పోలీస్ స్టేషన్ కోసం అధికారుల చుట్టూ తిరిగిన తాను, అదే అధికారులు ముఖ్యమంత్రిగా తన వద్దకు వస్తున్నారని చెప్పిన సందర్భం యువతకు గొప్ప సందేశం. లక్ష్యం ఉంటే సాధ్యం కానిది ఏదీ లేదని ఆయన జీవితం చెబుతోంది.రేవంత్ రెడ్డి రాజకీయ జీవితం సాఫీ ప్రయాణం కాదు. విమర్శలు... కేసులు... ఆరోపణలు... రాజకీయ ఒత్తిళ్లు... వ్యక్తిగత దాడులు... ప్రతి దశలో సవాళ్లు ఎదురయ్యాయి. కానీ ఒక్క అడుగు కూడా వెనక్కి వేయలేదు. ప్రతి అడ్డంకిని అవకాశంగా మార్చుకున్నారు. ప్రతి ఓటమిని విజయానికి మెట్టుగా మలిచారు. అందుకే ఆయన ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంక్షేమం, వ్యవసాయం, పెట్టుబడులు, ఉపాధి, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, వరంగల్ విమానాశ్రయం, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి కార్యక్రమాలు ఆయన పాలనలో ప్రధాన చర్చగా నిలిచాయి.

తనకు తొలి విజయాన్ని అందించిన మిడ్జిల్‌ను ఆయన ఎప్పుడూ మరచిపోలేదు. అందుకే ప్రజా ప్రతినిధిగా ఇరవై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అదే నేలపై ప్రజల మధ్యకు వెళ్లడం రాజకీయ కృతజ్ఞతకు నిదర్శనం. మిడ్జిల్‌లో మొదలైన అడుగు... శాసన మండలిని చేరింది. అసెంబ్లీని చేరింది. పార్లమెంట్‌లో ప్రతిధ్వనించింది. చివరకు తెలంగాణ సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని చేరుకుంది. అది ఒక వ్యక్తి రాజకీయ ప్రస్థానం మాత్రమే కాదు... లక్ష్యాన్ని నమ్మిన మనిషి సాధించిన విజయగాథ. ప్రజల విశ్వాసమే బలం... పోరాటమే ఆయుధం... పట్టుదలే పెట్టుబడి... ఈ మూడు పదాలే రేవంత్ రెడ్డి రాజకీయ జీవితాన్ని నిర్వచిస్తాయి. చరిత్రను మార్చేది వేల అడుగులు కాదు... సరైన సమయంలో, సరైన దిశలో, దృఢ సంకల్పంతో వేసిన ఆ ఒక్క అడుగే. ఆ ఒక్క అడుగే రేవంత్ రెడ్డిని తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక అధ్యాయంగా నిలబెట్టింది.



గొట్టిముక్కుల బ్రహ్మచారి
సీనియర్ జర్నలిస్ట్
9441884389

# అప్పుల కుప్ప.. పేరుకే గొప్ప...



అప్పు... ఈ మాటలు వింటే సామాన్యుల గుండె జల్లుమంటుంది. సంపాదనలో చాలా భాగం అప్పులు, వాటి వడ్డీలు చెల్లించటానికే సరి పోతోంది. అందుకే అప్పు అనే పదం చెవిన పడితే చాలు. ఏదో తెలీని భయం జనాలను ఆందోళనకు గురి చేస్తుంది. అలాగని అసలు అప్పులే చేయకుండా జీవితాలు సాగి పోతాయా అంటే అది కూడా అసాధ్యమే. మన దేశంలో అప్పులు లేకుండా జీవించే వారి శాతం గురించి తెలుసుకుంటే ఆచ్చర్యం వేస్తుంది. కేవలం మూడు శాతం మంది జనం మాత్రమే ఏ అప్పులు లేకుండా జీవిస్తున్నట్లు ఓ సర్వే వివరించింది. అంటే దేశంలోని 97 శాతం మంది జనాభా ఎంతో కొంత అప్పుతోనే వున్నారు. అప్పు చేసి పప్పు కూడు తినటం మనకు అలవాటు. కుటుంబ అవసరానికి అప్పులు చేయటం తప్పనిసరి. కానీ అవసరం లేకపోయినా అప్పులు చేసి ఇబ్బంది పడే వారు కూడా సమాజంలో లేకపోలేదు. పెళ్లిళ్లు, పేరంటాళ్లు, సరదాలు, హోదాలు, వ్యసానాలు, అవసరాలు, అనారోగ్యం ఇలా ఏదో ఒకటి మనిషిని అప్పుల వైపు అడుగులు వేయిస్తూనే ఉంటుంది. మన దేశంలో సగటున అయిదు లక్షల వరకు అప్పులు వున్న వారు 49 శాతం వున్నారని, పది నుంచి 25 లక్షల అప్పులు వున్న వారు 27 శాతం ఇక 25 నుంచి కోట్లలో అప్పులు వున్న వాళ్ళు 22 శాతం మేరకు ఉన్నట్టు ఓ ఆర్థిక సర్వే స్పష్టత నిచ్చింది. ఈ సర్వే విశ్వసనియత ఎలా వున్నా దేశంలోని ప్రతీ ఒక్కరిపై ఇప్పుడు అప్పుల భారం వుంది. అదే మన ప్రభుత్వాలు మనకు ఇచ్చిన నజరానా. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అప్పులు వెరసి జనం పైనే పడుతున్నాయి. ఇవి జనానికి కనిపించని అప్పులు. తెలీకుండానే నెత్తిన పడిన బాకీలు. ప్రస్తుతం దేశంలోని ప్రతీ ఒక్కరి పైన సగటున 1273 రూపాయల అప్పు ఉన్నట్టు తేల్చి చెప్పిన సర్వేలు భవిష్యత్తులో ఇవి రెండు, మూడు రేట్లు పెరిగే అవకాశం కూడా ఉన్నట్టు స్పష్టంగా చెప్పేస్తున్నాయి.

కేంద్రం చేసే అప్పుల మాట అటుంచితే రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అప్పులే ఇప్పుడు ఆందోళనకరంగా మారుతున్నట్లు ఆర్థిక నిపుణులు వివరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పుల ఊబిలో ఇరుక్కు పోయిందని, తెలంగాణ రాష్ట్రం కూడా అప్పుల ఉచ్చులో చిక్కి విల, విలలాడుతోందని నిపుణులు వివరిస్తున్నారు. రాష్ట్ర ఆదాయాన్ని మించి తెలుగు రాష్ట్రాలు అప్పులు చేశాయి. ఉత్పత్తి రంగాల కోసం అప్పులు చేయటం ఓ విధానం. దీని వల్ల భవిష్యత్ లో సంపద సృష్టి జరిగే అవకాశం ఉంటుంది. కానీ గొప్పల కోసం, సంక్షేమ కార్యక్రమాల కోసం అప్పులు తెచ్చి ఖర్చు పెట్టటం వల్ల తిరిగి ఆ అప్పుల భారం ప్రజల నెత్తినే పడుతోందని ఆర్థిక వేత్తలు లెక్కలు చెప్పుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఆదాయ వనరులు పైన పెడుతున్న ఖర్చుకు సంక్షేమ కార్యక్రమాలకు పెడుతున్న ఖర్చు కు పొంతనం వుండటం లేదు. ఇదే రాష్ట్రాలను అప్పుల కుప్పగా మార్చేస్తూ ఆర్థిక సంక్షోభం వైపు నెట్టేస్తున్నట్లు వారు చెప్పుతున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పన్నెండు లక్షల కోట్ల అప్పుల్లో ఉండగా, తెలంగాణ రాష్ట్రం దాదాపుగా ఎనిమిది లక్షలు కోట్ల అప్పుల భారం మోస్తోందని నిపుణులు లెక్కలు వేస్తున్నారు. ఈ అప్పుల చెల్లింపులు, వడ్డీలు రాష్ట్రాలకు తడిసి మోపెడు అవుతున్నాయని అంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అప్పుల లెక్కల మేరకు ఆంధ్రప్రదేశ్ లో సగటు వ్యక్తి పైన ఆరు వందల నుంచి ఎనిమిది వందలు, తెలంగాణలో అయిదు వందల రూపాయల మేరకు అప్పు ఉందని వారు వివరిస్తున్నారు.

రాష్ట్రాలు చేసే అప్పుల పైన రిజర్వుబ్యాంకు, కేంద్ర ఆర్థిక శాఖ నియంత్రణ ఉంటుంది. ముఖ్యంగా విదేశీ ఆర్థిక సంస్థల నుంచి రాష్ట్రాలు అప్పులు తీసుకొనే సమయంలో కేంద్రం, రిజర్వు బ్యాంకు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఇక్కడే రాష్ట్రాలు జిమిక్కులు చేస్తున్నాయి. ప్రాజెక్ట్ ల నిర్మాణం, అభివృద్ధి పనులు, అత్యంత అవసరమున్న అంశాలు ముందుకు తీస్తున్నాయి. వీటి పేరుతో తెస్తున్న రుణాలు ఇతర అవసరం కోసం వాడేస్తున్నాయి. ఇది రాష్ట్రాలకు ఓ అలవాటుగా మారిపోయింది. ఏడాదికి ఏడాది ఇదే పంథాలో రాష్ట్రాలు సాగి పోతున్నాయి. అనుత్పాదక రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. రాష్ట్రాల ఆదాయం, వ్యయం, అభివృద్ధి, లోపాలపైన ప్రతి ఆర్థిక సంవత్సరం కాగ్ ఓ సమగ్రమైన నివేదిక ఇస్తోంది. రాష్ట్రల ప్రగతి, అభివృద్ధి, జరుగుతున్న, జరిగిన తప్పులు కూడా ఇందులో వివరిస్తూ వస్తోంది. అయినా రాష్ట్ర ప్రభుత్వాలు దాన్ని సీరియస్ గా తీసుకోవటం లేదు. ఇక రాష్ట్రాలు అప్పుల ద్వారా తెచ్చుకుంటున్న నిధుల్లో కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్న సందర్భాలు కూడా కోకొల్లలుగానే వున్నాయి. ప్రజలను మచ్చిక చేసుకోవటం, ఓట్ల బ్యాంకును పెంచుకోవటం, అధికారమే లక్ష్యంగా ఉచిత హామీలు ఇవ్వటం, వాటిని అమలు చేసేందుకు చివరికి ప్రభుత్వం భూములు అమ్మటం,సంస్థలను తాకట్టు పెట్టటం వంటివి ఇప్పుడు పాలకులకు ఏకైక మార్గం అయింది. సంపద సృష్టి మార్గాలు వున్నా వాటిపై పూర్తి స్థాయి దృష్టి పెట్టే పరిస్థితిలో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు లేవు. మద్యం, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ వంటి వాటి ద్వారా వచ్చే ఆదాయం, పన్నుల రూపంలో ఖజానాకు చేరే రాబడి ఇవే ప్రభుత్వాలకు ఆదాయ వనరులు అవుతున్నాయి. ఈ మొత్తాలు పాలన సాగించటానికి, ఉద్యోగుల జీతం, భత్యం చెల్లింపులు, రోజు వారీ పరిపాలన వ్యవహారాలకు కూడా సరి పోవటం లేదు. దింతో అప్పులు తప్పని పరిస్థితి వస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు చేయటం కొత్తేమి కాదు. అవి శక్తికి మించితేనే ముtప్పు అంటున్నారు ఆర్థిక నిపుణులు. అప్పులు గుట్టలుగా పేరుకు పోతే రాష్ట్రం దివాళ దిశగా అడుగులు వేస్తుందని, ఇది ప్రజల పైన పెను ప్రభావం చూపుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ అప్పుల పైనే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో అధికార, విపక్షాల మధ్య నిప్పు రాచుకుంది. మీ వల్లే రాష్ట్రం అప్పుల మాయంగా మారిందంటూ అధికార, విపక్షాలు ఒకరిపై ఒకరు బురద జల్లుకుంటున్నారు. ఒకరు చేసిన తప్పులు మరొకరు బట్టబయలు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో అప్పులు అనూహ్య రీతిలో పెరిగి పోయాయి. తెలంగాణలో కూడా అటు, ఇటుగా పది లక్షల కోట్ల అప్పు ఇప్పుడు నెమ్మదిగా వెలుగులోకి వస్తోంది. ఈ అప్పులకు చెల్లించే వడ్డీలు ప్రభుత్వాలకు గుదిబండ అవుతున్నాయి. పాత అప్పుల వడ్డీల చెల్లింపుల కోసం కొత్త అప్పు తప్పట్లేదు. ఇక ఉచితాలకు ఎన్ని వేల కోట్లు ఖర్చు అవుతుందో అంతు పట్టటం లేదు. ఈ అప్పుల భారం మధ్య ప్రజల ప్రాధాన్యతలు, అభివృద్ధి, ప్రగతి నామమాత్రమే అవుతోంది. నిజానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం ఎంత అప్పుల్లో వుందో ఖచ్చితంగా తెలీట్లేదు. అధికార పక్షం అప్పుల పైన ఓ లెక్క చెబితే విపక్షాలు మరో లెక్క చెబుతున్నాయి. వాస్తవంగా అప్పుల మొత్తం మాత్రం ప్రజలకు తెలీట్లేదు. ఇది మంచిదే. ఏ రాష్ట్రం ఎంత అప్పుల్లో వుందో తెలిస్తే ప్రజలకు నిద్ర కూడా పట్టదు. ఈ అప్పుల పైన అధికార, విపక్షాలు సవాళ్ళను పక్కన పెట్టి వీటి నుంచి బయట పడే మార్గాన్ని ఆలోచించాలి. అంతే కానీ అప్పులు, తప్పులు లెక్కించుకుంటూ రచ్చ చేయటం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. పాలకులు ఇప్పుడు ఆచీ, తూచీ అడుగులు వేస్తూ అప్పుల నుంచి రాష్ట్రం విముక్తి అయ్యే దిశగా నిర్ణయాలు తీసుకోవాలి. గొప్పలకు పోయి అప్పులు తెచ్చుకుంటే చివరికి మిగిలేది చిప్పలే. ఇది నూటికి నూరు పాళ్ల నిజం...



జి. వెంకటరమణ.
సీనియర్ జర్నలిస్ట్.

## వైరల్ మోజు...

# విలువల పతనం...!

"ఒక వీడియో వైరల్ అయింది"... "కొన్ని లక్షల వ్యూస్ వచ్చాయి"... "మిలియన్ల ఫాలోవర్లు పెరిగారు"... నేటి డిజిటల్ ప్రపంచంలో ఇవే విజయానికి కొత్త కొలమానాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు మంచి పనికి పేరు వచ్చేది. ఇప్పుడు సంచలనం సృష్టిస్తే చాలు, ఒక్క రాత్రిలో సెలబ్రిటీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. సాంకేతికత మనిషికి అపారమైన అవకాశాలు కల్పించినా, అదే సాంకేతికతను బాధ్యత లేకుండా ఉపయోగిస్తే సమాజానికి ఎంతటి ముప్పు వాటిల్లుతుందో ఇటీవలి పరిణామాలు స్పష్టంగా చెబుతున్నాయి.

సోషల్ మీడియా మన జీవితంలో విడదీయరాని భాగమైంది. సమాచారం, విద్య, ఉపాధి, వ్యాపారం, వినోదం... ప్రతి రంగంలో అది విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ప్రతిభ ఉన్నవారికి ప్రపంచ స్థాయి వేదికను కల్పించింది. కానీ మరోవైపు లైక్‌లు, షేర్లు, ఫాలోవర్ల కోసం విలువలను తాకట్టు పెట్టే సంస్కృతికి కూడా దారితీసింది. ఈ ధోరణి వ్యక్తిని మాత్రమే కాదు, కుటుంబాలను, సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

ఇటీవలి కాలంలో వైరల్ అవుతున్న వీడియోలను పరిశీలిస్తే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో తెలుస్తోంది. అసభ్యకర ప్రవర్తన, ప్రమాదకర స్టంట్లు, కుటుంబ సభ్యుల వ్యక్తిగత జీవితాన్ని బహిరంగంగా ప్రదర్శించడం, చిన్నపిల్లలను కూడా కంటెంట్ కోసం వినియోగించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. కొన్ని నిమిషాల ప్రజాదరణ కోసం జీవితాంతం మిగిలే అవమానాన్ని కొందరు స్వయంగా కొనితెచ్చుకుంటున్నారు. "వైరల్ అయితే చాలు" అనే ఆలోచన "సరైనదేనా?" అనే ప్రశ్నను పూర్తిగా మరిపిస్తోంది.

ఈ వైరల్ సంస్కృతికి మరో ప్రమాదకర రూపం సైబర్ నేరాలు. సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని యువతను మోసం చేసే గ్యాంగులు రోజు రోజుకూ కొత్త పద్ధతులు అవలంబిస్తున్నాయి. నకిలీ ప్రొఫైల్‌లు, ప్రేమ పేరుతో మోసాలు, ఆర్థిక సహాయం పేరుతో ఉచ్చులు, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి బ్లాక్‌మెయిల్ చేయడం వంటి నేరాలు విస్తరిస్తున్నాయి. బాధితుల బలహీనతలను ఆయుధంగా మార్చుకుని నేరగాళ్లు కోట్ల రూపాయలు దోచుకుంటున్నారు. పరువు పోతుందనే భయంతో చాలామంది ఫిర్యాదు చేయకపోవడం వారికే బలం అవుతోంది.

ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే... సైబర్ నేరాలకు ప్రధాన కారణం సాంకేతిక పరిజ్ఞానం కాదు. అప్రమత్తత లేకపోవడమే. డబ్బు, విలాసవంతమైన జీవితం, గుర్తింపు కోసం కొందరు అపరిచితులను గుడ్డిగా నమ్ముతున్నారు. సోషల్ మీడియాలో కనిపించేదంతా నిజమని భావించడం ప్రమాదకరం. ఒకసారి వ్యక్తిగత సమాచారం బయటకు వెళ్లిన తర్వాత దానిని పూర్తిగా నియంత్రించడం దాదాపు అసాధ్యం.

ఇక కుటుంబ వ్యవస్థను బలహీనపరుస్తున్న మరో అంశం అక్రమ సంబంధాల పెరుగుదల. చిన్న చిన్న అపార్థాలు, పరస్పర సంభాషణ లేకపోవడం, డిజిటల్ ప్రపంచంలో కొత్త పరిచయాలు... ఇవన్నీ కలిసి అనేక కుటుంబాల్లో సంక్షోభానికి కారణమవుతున్నాయి. క్షణికమైన ఆకర్షణతో తీసుకునే తప్పు నిర్ణయాలు చివరకు విడాకులు, హత్యలు, ఆత్మహత్యలు, పిల్లల అనాథ జీవితాలకు దారి తీస్తున్నాయి. వ్యక్తిగత నిర్ణయం అనిపించినా దాని ప్రభావం మొత్తం కుటుంబంపైనే పడుతోంది. సాంకేతికత అభివృద్ధి చెందిన కొద్దీ మానవ సంబంధాలు కూడా బలోపేతం కావాలి. కానీ ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఇంట్లో కూర్చుని కూడా కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం తగ్గిపోయింది. ప్రతి ఒక్కరూ తమ తమ మొబైల్ ప్రపంచంలోనే జీవిస్తున్నారు. సంభాషణ తగ్గితే అపార్థాలు పెరుగుతాయి. అపార్థాలు పెరిగితే సంబంధాలు దెబ్బతింటాయి. అదే అనేక సమస్యలకు మూలకారణంగా మారుతోంది.

ఈ పరిస్థితులకు చట్టాలు మాత్రమే పరిష్కారం చూపలేవు. విలువలతో కూడిన కుటుంబ వాతావరణం, బాధ్యతాయుతమైన విద్య, డిజిటల్ అవగాహన, సామాజిక బాధ్యత... ఇవన్నీ కలిసొస్తేనే మార్పు సాధ్యమవుతుంది. పిల్లలకు సాంకేతిక పరిజ్ఞానం నేర్పడంతో పాటు దానిని ఎలా బాధ్యతగా ఉపయోగించాలో కూడా బోధించాలి. సోషల్ మీడియాలో ఏమి పంచుకోవాలి? ఎవరిని నమ్మాలి? ఎలాంటి ప్రమాదాలు ఎదురవుతాయి? అనే అంశాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన అవసరం.

తల్లిదండ్రులు కూడా పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి. వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవాలి. నియంత్రించడం కంటే నమ్మకం కల్పించడం ముఖ్యం. అలాగే భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం, విశ్వాసం, సంభాషణ ఉంటే అక్రమ సంబంధాలకు అవకాశం తగ్గుతుంది. కుటుంబ బంధాలు బలపడితే సమాజం కూడా బలపడుతుంది.

సోషల్ మీడియా సంస్థలు కూడా తమ బాధ్యతను విస్మరించకూడదు. హానికరమైన కంటెంట్, అసభ్యకర ప్రచారం, మోసపూరిత ఖాతాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం, పోలీసులు, విద్యాసంస్థలు కలిసి డిజిటల్ భద్రతపై ప్రజల్లో నిరంతర అవగాహన కల్పించాలి.

వైరల్ కావడం విజయం కాదు. కోట్ల వ్యూస్ జీవితానికి విలువను తీసుకురావు. మన వల్ల కుటుంబం గర్వపడితేనే అది నిజమైన విజయం. మన ప్రవర్తన వల్ల సమాజానికి మంచి జరిగితేనే అది గుర్తింపు. డిజిటల్ యుగంలో సాంకేతికత మన చేతిలో ఉండవచ్చు. కానీ దానిని నడిపించేది మన విలువలే. వ్యూస్ తగ్గినా మళ్లీ వస్తాయి. డబ్బు పోయినా తిరిగి సంపాదించవచ్చు. కానీ ఒకసారి కోల్పోయిన గౌరవం, నమ్మకం, కుటుంబ బంధాలు తిరిగి పొందడం చాలా కష్టం. అందుకే సంచలనాల వెంట పరుగెత్తే ముందు... మన విలువలు, మన కుటుంబం, మన బాధ్యతలను ఒక్కసారి గుర్తు చేసుకోవడం ప్రతి పౌరుడి కర్తవ్యం.

అమరవాజీ నాగరాజు
జర్నలిస్ట్





# కుల బహిష్కరణ జరగలేదు... అసత్య ఆరోపణలే

**ఆరోపణలను ఖండించిన, చంద్రవెల్లి గ్రామ-యాదవ సంఘ నాయకులు.**

**బెల్లంపల్లి.మహ**:కుల బహిష్కరణ చేశారంటూ, పవన్, మంజుల దంపతులు, గురువారం చేసిన ఆరోపణలు అసత్యమని, వారు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల చంద్ర వెల్లి గ్రామ యాదవ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టేకుల బస్తి బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పొలవేణి పవన్, మంజుల, దంపతులతో పోలవేన రాజులకు జరుగుతున్న భూముల వివాదం, యాదవ సంఘం వద్దకు ఫిర్యాదులు రాగా, ఇరు వర్గాలకు గొడవలు జరగకుండా నచ్చ చెప్పే ప్రయత్నం చేశామని, వాటిని నచ్చని పవన్, మంజుల దంపతులు, సంఘం ప్రతినిధులను చెప్పరాని మాటలతో దూషించారని, అయినా ఊరుకున్నామని, సంఘం ప్రతినిధులు రాజుకు మద్దతు తెలుపుతున్నారని భావించిన పవన్, మంజుల దంపతులు, కుల బహిష్కరణ చేశారంటూ, మమ్మల్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని, ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకొని ఇరువర్గాలు సంప్రదింపులతో సమస్యలు పరిష్కరించుకొని అందరితో కలిసి మెలిసి ఉండాలని సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.వారికి సంఘం ప్రతినిధులతో అవసరం లేదనుకుంటే వారి ఇష్టం వచ్చిన చోట సమస్యలను పరిష్కరించుకోవచ్చని, వాటిని దృష్టిలో పెట్టుకొని సంఘం నాయకులను, ప్రతినిధులను ప్రతిష్టపాలు చేయొద్దని, అన్నదమ్ముల మధ్య జరుగుతున్న భూవివాదాలు, పోలీసుల వరకు వెళ్లాయని, వారు చెప్పిన పవన్, మంజుల దంపతులు, వారి సూచనలు సైతం వినకుండా, ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల బహిష్కరణ చేసే అధికారం మాకు లేదనీ, మేము చేయలేదనీ, ఇప్పటికైనా అందరితో కలిసి మెలిసి ఉండడానికి ప్రయత్నిస్తే బాగుంటుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో పోలవేణి మొండి, పోలవేణి రాజు, రంగ నాగరాజు, కొమ్ము రాజేష్, పోలవేణి చందు, మారం రాములు, పోలవేణి రాగులయ్య, పెద్దాగుల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలి

**ఆదిలాబాద్ మహా:** పర్యాటకులను ఆకర్షించేలా గోండు రాజుల కోట పునరుద్ధరణ పనులు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని చారిత్రక రాజు గోండుల కోటను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్, పిఓ కోట పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు.అనంతరం ఐటిడిఏ పిఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గోండు రాజుల చరిత్రకు, గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రాజు గోండుల కోటను త్వరితగతిన పునర్నిర్మించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆధునిక సౌకర్యాలతో దేశవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేలా దీనిని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. కోట పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడా చారిత్రకతకు భంగం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. భావితరాలకు గిరిజనుల గొప్ప చరిత్రను తెలియజేసే విధంగా కోటలో ఒక అత్యాధునిక మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మ్యూజియంలో గోండు రాజుల వంశ చరిత్ర, వారి పాలన, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ ఆనవాళ్లు, పురాతన వస్తువులు, చారిత్రక ఆధారాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా కోట ప్రాంగణంలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదిక, గిరిజన హస్తకళలు, సంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటితో పాటు చిన్నారుల కోసం ప్రత్యేక పార్కు, క్రీడా ప్రాంగణం, సందర్శకుల కోసం రూఫింగ్ షెడ్లు, విశ్రాంతి భవనాలు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆకర్షణీయమైన ఉద్యాన వనాలు, విద్యుద్దీపాల అలంకరణ, పచ్చదనం పెంపు వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. సందర్శకులు కోట చరిత్రను సులభంగా తెలుసుకునే విధంగా సమాచార ఫలకాలు, దిశానిర్దేశక బోర్డులు, డిజిటల్ సమాచార వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కోట అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉట్నూర్ ప్రాంతం పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజు గోండుల కోటను సుందరీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలని ఐటిడిఏ పిఓ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్కియాలజీ డైరెక్టర్ అర్జున్ రావు, అదనపు డైరెక్టర్ నరసింహులు, డిడి సాగర్, ఓఎస్డి రాజు, పర్యాటక శాఖ అధికారి రవి కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ తానాజీ, ఏపీఓ పిబిటిజి ఆత్రం భాస్కర్, డిప్యూటీ డిఇఓ చందన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.





# అభివృద్ధి పనులకు భూమిపూజ

**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష ఎమ్మెల్యే తో కలిసి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. 5, 20, 21, 22, 24, 31, 38, 48, 49వ వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు.మొత్తం 9 వార్డులలో కోటీ 79 లక్షలతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సుమారు రూ. 150 కోట్ల విలువైన మరిన్ని అభివృద్ధి పనులను పట్టణానికి తీసుకురావడానికి కృషి జరుగుతోందని తెలిపారు.పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించి, అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులను పార్టీలకతీతంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. అత్యవసర పరిస్థితుల కోసం రెస్క్యూ టీం, వైద్య సిబ్బందితో పాటు టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంచుతామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ ప్రజలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పరిసరాలు పరిశుభ్రంగా ..

- దోమల బెడద ఉండకుండా..
- డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో కలెక్టర్

**ఆదిలాబాద్ మహా**: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ తమ ఇళ్లలో తప్పనిసరిగా ప్రతి శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. స్థానిక కెఆర్కె కాలనీలో డెంగ్యూ వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్, వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. ఇళ్లలో నీటిని ఎక్కువగా నిల్వ ఉంచడం వల్ల అందులోనే దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. అందుకే అవసరమైన మేరకే నీటిని నిల్వ చేసుకోవాలని, పాత్రలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచించారు. డెంగ్యూ వస్తే ప్లేట్‌లెట్స్ పడిపోయి నెల రోజుల పాటు కోలుకోలేరని, కాబట్టి అనవసరమైన నీటిని నిల్వ ఉంచకుండా వెంటనే పారబోయాలని సూచించారు. కాలనీల్లో శానిటేషన్, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ఇద్దరు జిల్లా అధికారులను నియమించామని, అవసరమైతే అదనపు వాహనాలతో శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే, కె.ఆర్.కె కాలనీ అభివృద్ధికి, ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సుమారు రూ. 6 నుండి 7 కోట్ల నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని, త్వరలోనే ఈ పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఇంటింటి సర్వే లో పాల్గొని ఫ్రైడే డ్రైడే పాటించాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్ నాక్సెన్, ఆశాలు, కాలనీ ప్రజలు, మున్సిపల్, వైద్య, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# హైడ్రాలిక్ లిఫ్ట్ ప్రారంభం

**ఆదిలాబాద్ మహా** : జిల్లా పోలీసు శాఖలో వాహనాల నిర్వహణను మరింత ఆధునికంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు హైడ్రాలిక్ లిఫ్ట్ వ్యవస్థ తోడ్పడుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం వద్ద ఏర్పాటు చేసిన నూతన కార్ హైడ్రాలిక్ లిఫ్ట్ వ్యవస్థను శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన శాస్త్రోక్తంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాన్ని పరిశీలించి, వాహనాల మరమ్మతులకు అవసరమైన విడిభాగాలు, మెకానిక్ పనిచేసే గదిని తనిఖీ చేశారు. పోలీసు వాహనాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహిస్తూ, అత్యవసర విధులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నూతన హైడ్రాలిక్ వ్యవస్థతో వాహనాల మరమ్మతులు వేగవంతంగా, నాణ్యతతో నిర్వహించేందుకు వీలుకలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) పి. మౌనిక ఐపీఎస్, డీఎస్పీ కమటం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు టి. మురళి, ఎన్. చంద్రశేఖర్ మరియు రిజర్వ్ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో

## యూనిఫామ్‌ల పంపిణీ

**పాలకుర్తి, జూలై 03 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ మరియు వర్షాకాల ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెద్దపెల్లి తిరుమల ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు గ్రామ ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వారు ప్రజలకు వివరించారు.సర్పంచ్ మాట్లాడుతూవర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఇళ్లు ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వైద బుగ్గ రామస్వామి,వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉద్యమకారులపై దాడులా?

**హామీలను అమలు చేయాలని డిమాండ్**

**వలిగొండ జులై 3 మహా న్యూస్ :** ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గురువారం ఉద్యమకారులు హైదరాబాదులో ఉద్యమకారులపై పోలీసులు లాటి చార్జీ చేసి దాడులు చేయడం ఏమిటని మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రశ్నించారు రాజ్యాంగబద్ధంగా ప్రజాస్వామిక బద్ధంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలనే అమలు చేయాలని ప్రశాంతంగా భూ పోరాటం చేస్తే తప్పా అని ఆయన ప్రశ్నించారు కవితను అరెస్టు చేసిన తీరును ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా వెంటనే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు

## చేనేత సహకార సొసైటీ కి నామినేషన్

**భువనగిరి జులై 3 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో శుక్రవారం చేనేత సహకార సొసైటీకి మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి జనార్దన్ నామినేషన్ దాఖలు చేశారు ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేశానని నాకు ఒక అవకాశం ఇచ్చి గెలిపించినట్లయితే సొసైటీకి కూడా న్యాయం చేస్తానని అన్నారు

# ప్రజలు గంజాయి,సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డ్రగ్స్ మరియు నేర రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం : మంచిర్యాల డీసీపీ భాస్కర్




**బెల్లంపల్లి మహ:**తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రోజున మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే విద్యార్థులకు గంజాయిసైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ,సి. ఐ దేవయ్య లుహాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యం,భవిష్యత్తు, విద్య,ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులు కుటుంబానికి, సమాజానికి భారంగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు,సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే మోసాలు,ఫేక్ లింకులు ,డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్లు ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, మహిళలు,బాలికలు ఎలాంటి వేధింపులు, గృహ హింస,సైబర్ వేధింపులు లేదా ఇతర సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ చేపడుతున్న ప్రత్యేక చర్యలు, అందుబాటులో ఉన్న సేవల గురించి వివరించారు.మాదక ద్రవ్యాల విక్రయం, రవాణా,వినియోగం, సైబర్ మోసాలు లేదా మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని విద్యార్థులను కోరారు అదేవిధంగా విద్యార్థుల నుండి ప్రహరీ క్లబ్ ఏర్పాటు గురించి దాని పనితీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.డ్రగ్స్ రహిత,నేర రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు. అనంతరం డిసిపి పాఠశాల పరిసర ప్రాంతాలతో పాటు సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు .ఈ అవగాహన కార్యక్రమంలో తాండూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ దేవయ్య, మాదారం ఎస్సై సౌజన్య ,పాఠశాల ప్రిన్సిపాల్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేయూ దూరవిద్య పీజీ, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభం

- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఎస్డిఎల్సి స్టడీ సెంటర్
- ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్




**బెల్లంపల్లి,మహ:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గల కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య (SDLCE) కేంద్రంలో పిజి మరియు డిగ్రీ కోర్సులలో ప్రవేశానికి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రాతిపదికన దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరం 202627లో పీజీ లేదా డిగ్రీ చేసేందుకుగాను సెప్టెంబర్ నెల 15వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓపెన్ పీజీలో ఎంఏ, ఎంకామ్ లో అన్ని సబ్జెక్టులలో చదివేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే ఓపెన్ డిగ్రీలో బిఏ, బీకాం, బీఎస్సీ అన్ని కోర్సులలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు... సద్వినియోగం చేసుకోండి....దూర విద్య ద్వారా పీజీ లేదా డిగ్రీ చేయాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. పీజీ చేసేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్770 ద్వారా, మరియు డిగ్రీ చదివేందుకు స్టడీ సెంటర్ కోడ్ నెంబర్043 ద్వారా ఆన్లైన్ లో www.sdlceku.co.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకొని ప్రింట్ అవుట్ తీసుకొని సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి 2 సెట్లు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలోని కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య స్టడీ సెంటర్లో అందజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ కోరారు. వివరాలకు 9959269975 నంబర్ లో సంప్రదించాలని సూచించారు.

మందమర్రి మండలంలో

# విద్యా వ్యాపారం పెట్రేగిపోతుంది..!

- అన్ని అనుమతులు లేకుండానే ప్రైవేట్ పాఠశాలల ప్రారంభోత్సవాలు
- మండల విద్యాధికారి మౌనం పై అనుమానాలు




**మందమర్రి, మహా :** మందమర్రి మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్య యాజమాన్యాలు పెట్రేగిపోతున్నాయి. ఈమధ్య అన్ని అనుమతులు లేకుండానే పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం అయ్యాయని కొన్ని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.సొసైటీ రిజిస్ట్రేషన్ డిఇఓ గుర్తింపు, ఫైర్ శాఖ ఎన్ఓసి, భవన అనుమతులు లేకుండానే యాజమాన్యాలు తరగతి గదులు నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆరోపిస్తూ సదరు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గత కొన్ని రోజుల క్రితం పలు విద్యార్థి సంఘాల నేతలు ఎంఈఓ కు లిఖితపూర్వక ఫిర్యాదులు చేశాయి. అయితే సదరు అధికారి ఇప్పటివరకు ఆ పాఠశాలలపై స్పందించడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్.టి.ఈ. చట్టం ప్రకారం అనుమతులు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలు నడిపితే లక్షలు రూపాయల వరకు జరిమానా విధించి, ఆ పాఠశాలలను సీజ్ చేసే అధికారం విద్యా శాఖకు ఉన్న కూడా విద్యాధికారి స్పందించకపోవడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**ఈ అధికారుల అనుమతులు తప్పనిసరి**

ప్రైవేట్ పాఠశాలను స్థాపించాలంటే పాఠశాలను నడిపే యాజమాన్యం తప్పనిసరిగా సొసైటీ రిజిస్ట్రేషన్ యాక్ట్1860, ఇండియన్ ట్రస్ట్ యాక్ట్1882 కింద రిజిస్టర్ అయి ఉండాలి. ఇది లాభాపేక్ష లేకుండా విద్యా సేవ కోసమే పనిచేయాలి. విద్యా శాఖ అనుమతిరిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, ప్రాథమిక పాఠశాలలకు జిల్లా విద్యాధికారి డి.ఈ.ఓ. అనుమతి, గ్రామీణ ప్రాంతంలో అయితే కనీసం 1 ఎకరం, పట్టణ ప్రాంతంలో అయితే 500 చదరపు మీటర్ల సొంత స్థలం, అది లేని పక్షంలో 30 సంవత్సరాల వరకు భూమి లీజు అగ్రిమెంట్ కలిగి ఉండాలి. ఇక భవనం విషయానికి వస్తే క్లాస్‌రూమ్‌కు కనీసం 400 చదరపు అడుగుల స్థలం, మంచి వెంటిలేషన్ ఉండాలి, విద్యార్థులకు సరిపడా ఆట స్థలము తప్పనిసరి, అగ్నిమాపక శాఖ నుండి భవనం సురక్షితమని ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి, దానితోపాటు ఫైర్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలి.పట్టణ ప్రాంతం అయితే మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతం అయితే పంచాయతీ నుంచి భవన నిర్మాణ అనుమతి, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ స్థానిక సంస్థల నుండి పొందవలసి ఉంటుంది. ఆ తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ నుండి పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయని, తాగునీరు, టాయిలెట్స్ సదుపాయం ఉందని హెల్త్ ఆఫీసర్ నుండి ఎన్ఓసి ధృవపత్రము పొందాలి. అనంతరం ఆ పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులకు టెట్, బీఈడీ, డిఈడి, విద్యార్హతలు కలిగి ఉండాలి. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలీ, దానితోపాటు ఆర్.టి.ఈ. యాక్ట్ 2009 ప్రకారం అన్ని పాఠశాలలు తప్పనిసరిగా అన్ని రకాల గుర్తింపు ధ్రువపత్రాలు తీసుకోవాలి. అవి తీసుకోకుండా పాఠశాలను ప్రారంభిస్తే లక్ష రూపాయల వరకు జరిమానా విధించి ఆ పాఠశాలను సీల్ చేసే అధికారం విద్యా శాఖకు ఉంది. ఇక చివరిగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫీజు నియంత్రణ కమిటీకి ఫీజుల వివరాలు సమర్పించి ఆమోదం పొందాలి. కానీ ఇక్కడ పూర్తి పాఠశాల అనుమతులు లేకుండానే పాఠశాలలను అట్టహాసంగా ప్రారంభించడం అందులో ప్రస్తుతం విద్యా బోధనలు జరగడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది.

**విద్యార్థి సంఘాలు ఫిర్యాదులు చేసిన చర్యలు శూన్యం**

ప్రైవేట్ విద్యాసంస్థలకు అనుమతులు లేవని వీటిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు మండల విద్యాధికారికి లిఖితపూర్వక ఫిర్యాదులు ఇచ్చిన చర్యలు శూన్యమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరి ఆ అధికారికి విద్యాసంస్థలు, యాజమాన్యాలపై విద్యాధికారి మౌనంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మందమర్రి మండల విద్యాధికారిని మొబైల్ ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.



# పాలకుర్తిలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవం

- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులకు జీవితాంతం రుణపడి ఉంటాం లబ్ధిదారులు**

**పాలకుర్తి, జూలై 03 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలో పేదల సొంతింటి కల సాకారమైంది.ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ వారి సతీమణి,మనాలి ఠాకూర్ ల ఆదేశాల మేరకు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవం నిర్వహించారు.గ్రామానికి చెందిన లబ్ధిదారులు మేకల కొమురక్కరాజయ్య, అలాగే కీర్తిశేషులు వేల్పుల లక్ష్మయ్యలక్ష్మి కుటుంబ సభ్యులు వేదమంత్రాలు, సాంప్రదాయ మధ్య నూతన గృహాలలో కి ప్రవేశించారు.ఈ శుభసందర్భంగా పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల గృహప్రవేశం చేసిన లబ్ధిదారులను నూతన వస్త్రాలతో వారికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ. తమకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, తమ జీవితకాల స్వప్నాన్ని నెరవేర్చిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మరియు,మనాలి ఠాకూర్ కి జీవితాంతం రుణపడి ఉంటామని వారు ఆనందం వ్యక్తం చేశారు.ఈ వేడుకలో గ్రామ ఉపసర్పంచ్ వైద బుగ్గ రామస్వామి ,వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలగాని రాజేశం, మేకల ప్రశాంత్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు.

# అరుణోదయ నాగన్న మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరని లోటు

- **ప్రజా కలల కోసం తన జీవితాన్ని గాళం చేసిన అరుణోదయ నాగన్న**



**కుషాయిగూడ, మహా:** సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సీనియర్ నాయకుడు నాగన్న మృతి విప్లవ సాంస్కృతికోద్యమానికి తీరని లోటని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షావలి, రెండు తెలుగు రాష్ట్రాల అరుణోదయ కన్వీనర్ ఇనుప సురేష్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మంలో నాగన్న కన్నుమూసిన విషయం తీవ్ర విషాదకరమని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్రమశిక్షణ, నిబద్ధతతో కూడిన జీవితం నాగన్న సొంతమని కొనియాడారు. చివరి శ్వాస వరకు నిజమైన కార్మికవర్గ నాయకుడిగా కొనసాగుతూ, ఎందరో విప్లవ సాంస్కృతిక కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యాన్ని జయించి కోలుకున్నప్పటికీ, కొద్ది రోజులకే ఆయన మరణించడం బాధాకరమని తెలిపారు. నాగన్న సేవలను స్మరించుకుంటూ ఆయనకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నట్లు షేక్ షావలి, ఇనుప సురేష్ తమ సంయుక్త ప్రకటనలో తెలిపారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను సక్రమంగా నిర్వర్తించాలి.!

- **బిఎల్ఓలకు సూచించిన డిప్యూటీ సీఈవో జయచంద్ర రెడ్డి**
- **క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలన**

**ఇబ్రహీంపట్నం జులై 3 మహా:** నియోజకవర్గంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని కార్యక్రమాన్ని డిప్యూటీ సీఈఓ పరిశీలించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ జయచంద్ర రెడ్డి 48-ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలోని, ఇబ్రహీంపట్నం మండలం చర్ల పటేల్ గూడ గ్రామంలో బూత్ లెవల్ ఆఫీసర్లు చేపడుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఆర్డీవో వై. శ్రీనివాస్ రెడ్డి, ఇబ్రహీంపట్నం తాహసిల్దార్ సునీత పాల్గొన్నారు. డిప్యూటీ సీఈఓ బిఎల్వలతో మాట్లాడుతూ... అర్హత కలిగిన ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను సకాలంలో అందజేయాలని, పంపిణీ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఫారాల పంపిణీ వివరాలను యాప్‌లో వెంటనే నమోదు చేయాలని, అవసరమైన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని బిఎల్వోలకు డిప్యూటీ సీఈఓ ఆదేశాలు జారీ చేశారు.




# ఆరోగ్య పాఠశాల పుస్తకావిష్కరణ

**అదిలాబాద్ మహా:** పట్టణంలోని రణదివేనగర్ జడ్పీ హైస్కూల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు రూపొందించిన ఆరోగ్య పాఠశాల పుస్తకాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం ఆవిష్కరించారు.విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో రూపొందించిన ఈ పుస్తకంలో వారంలోని ప్రతి రోజుకు ప్రత్యేక అంశాలను పొందుపరిచారు. సోమవారం పరిశుభ్రత , మంగళవారం పోషకాహారం, పండ్ల వినియోగం, బుధవారం సహజ ఆరోగ్యం, గురువారం మాదకద్రవ్యాల నివారణ, శుక్రవారం సీజనల్ వ్యాధుల నివారణ, శనివారం వ్యక్తిత్వ వికాసం, దేశానికి సేవలందించిన ప్రముఖుల జీవితాల ద్వారా స్ఫూర్తిదాయక అంశాలను ఇందులో చేర్చారు. ప్రాథమిక స్థాయి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ వినూత్న కార్యక్రమానికి స్కాచ్ అవార్డు లభించడం విశేషం.ఈ సందర్భంగా సుమారు రూ.8.5 లక్షల వ్యయంతో నిర్మించిన ఆదర్శ పాఠశాల మరుగుదొడ్లను కూడా చైర్పర్సన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. ఆరోగ్య పాఠశాల వంటి వినూత్న కార్యక్రమాన్ని అదిలాబాద్ జిల్లాలో ప్రవేశపెట్టడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమాన్ని రూపుదిద్దిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి, మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేస్తున్నారని, ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీఈఓ మాధవి, టీపీఓ సుమలత, డీఎంహెచ్ఓ అధికారి సుమలత, సంబంధిత శాఖల అధికారులు, వార్డు కౌన్సిలర్ అన్నపూర్ణ, కాలనీ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

- **గడువు లోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలి**

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద**




**మహా వరంగల్ బ్యూరో :** వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన ఈఆర్ఓ లు, సూపర్‌వైజర్లు, బీఎల్ఓ లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ఖచ్చితంగా నిబంధనలు పాటిస్తూ ప్రతి బీఎల్ఓ తమ పోలింగ్ కేంద్ర పరిధిలోని ప్రతి ఇంటిని స్వయంగా సందర్శించి ఓటరు వివరాలను నమోదు చేయాలని సూచించారు.అర్హులైన ప్రతి ఓటరు ఓటరు జాబితాలో పేరు మిస్ కాకుండా చూడాలని, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు.వరంగల్ తూర్పులో ఇప్పటివరకు ఎంత శాతం ఎస్ఐఆర్ నమోదు పూర్తయిందో, ఏ ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయో ఈఆర్ఓలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ద్వారా రూపొందించే ఓటరు జాబితా పారదర్శకంగా, లోపాలు లేకుండా, నాణ్యతతో కూడినదిగా ఉండాలని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

**ట్రాన్స్‌జెండర్ల నమోదు పై ప్రత్యేక దృష్టి**

వరంగల్ ఈస్ట్ పరిధిలో కొందరు ట్రాన్స్‌జెండర్లు ఎస్ఐఆర్ నమోదుకు ముందుకు రావడంలో సంకోచిస్తున్నట్లు అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, స్పందించిన కలెక్టర్ ప్రతి పౌరుడికి ఓటు హక్కు రాజ్యాంగబద్ధమైన హక్కు అని తెలిపారు.ట్రాన్స్‌జెండర్లు కూడా దేశ పౌరులేనని, వారిలో ఉన్న అపోహలను తొలగించి ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించి 100 శాతం నమోదు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, వరంగల్ ఆర్డీవో సుమ తో పాటు సంబంధిత అధికారులు సూపర్వైజర్లు , బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

# నూతన బస్టాండ్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య




**యాదాద్రి భువనగిరి జూలై 3 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చిన్న కందుకూరు స్టేజ్ వద్ద నూతనంగా నిర్మించిన బస్టాండ్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఈ బస్టాండ్‌ను దివంగత శ్రీమతి గుంటుకు యశోధమ్మ - యాదగిరి రెడ్డి జ్ఞాపకార్థం జనగాం ఉపేందర్ రెడ్డి ఒక లక్ష తన స్వంత నిధులతో నిర్మించి సమాజానికి అందించడం అభినందనీయమని బీర్ల అయిలయ్య కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రయాణికులు ఎండ, వర్షాలకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు బస్టాండ్‌లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.అలాగే దాతృత్వంతో ముందుకు వచ్చి ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాన్ని అందించిన జనగాం ఉపేందర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. దివంగత యశోధమ్మ - యాదగిరి రెడ్డి స్మృతిని చిరస్థాయిగా నిలిపే విధంగా నిర్మించిన ఈ బస్టాండ్ గ్రామ ప్రజలకు ఎన్నో సంవత్సరాల పాటు సేవలందిస్తుందని అన్నారు.ప్రజలు ప్రభుత్వ ఆస్తులను, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా నిర్మించిన వసతులను సంరక్షించుకోవాలని, పరిశుభ్రంగా ఉంచాలని బీర్ల అయిలయ్య గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, దాత కుటుంబ సభ్యులు, మహిళలు, యువకులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మసూద్ సేవలు చిరస్మరణీయం

**మద్దెల శివకుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**మాజీ వార్డ్ కౌన్సిలర్ మసూద్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. శుక్రవారం మద్దెల శివకుమార్ మృతి చెందిన మసూద్ కు నివాళులు అర్పించి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసూద్ అకాల మరణం బాధాకరమన్నారు. నివాళులర్పించి సంతాపం సానుభూతిని తెలియజేసిన వారిలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు సత్యనారాయణ(చిన్ని), నాయకులు అర్జునరావు, మున్సిపల్ కార్పొరేటర్లురావి రాంబాబు, హరిహర యాదవ్, సామాజిక సేవా ఆర్గనైజర్ అన్వర్ భాయ్, దళిత మైనారిటీ నాయకులు గుండా రమేష్, సల్మాన్ తోత, పూర్వ తెలుగుదేశం నాయకులు సుక్కా సురేష్, బుగుల రవి, దుర్జన్ బస్తి రవి తదితరులు ఉన్నారు.






# నవ మహిళా సాధికార కేంద్రంలో మహిళలకు చెక్కుల పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పాల్వంచ నవ లిమిటెడ్ సామాజిక కార్యక్రమాలలో భాగంగా నవ మహిళా సాధికార కేంద్రంలో మహిళలు తయారు చేసిన తాటి ఆకుల కళాకృతులు విక్రయించడంతో పాటు గార్మెంట్ మేకింగ్ ద్వారా వచ్చిన రూ.277362 నగదు చెక్కులను యూనిట్ హెడ్ తెలంగాణ ఆపరేషన్ రేర్ అడ్మిరల్ ఎల్ వి శరత్ బాబు (వి) మహిళలకు శుక్రవారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శరత్ బాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని ఆ కుటుంబం ఎప్పుడూ ఆనందమయంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి జి ఎమ్ హెచ్ ఆర్ ఏ శ్రీనివాస్ రెడ్డి సి ఎస్ ఆర్ సి హెచ్ శ్రీనివాసరావు ఆముద మహిళలు పాల్గొన్నారు.



# కారేపల్లిలో ఘనంగా మెకానిక్ డే

**కారేపల్లి , మహా**: కారేపల్లిలో శుక్రవారం మెకానిక్ డే ఘనంగా నిర్వహించారు. మండలంలోని టూవీలర్ మెకానిక్ లు అందరు కలిసి మెకానిక్ అసోసియేషన్ జెండాను అవిష్కరించారు. ద్విచక్ర వాహన సృష్టికర్త జర్మనీకి చెందిన ఇంజనీర్ గాట్లీబ్ డైమ్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు సిహెచ్. రాంబాబు, పోతు శ్రీరాములు మాట్లాడుతూ అసంఘటితంగా ఉన్న మెకానిక్ ల సంక్షేమానికి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. మెకానిక్ లకు భీమా సౌకర్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో కోటా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో మెకానిక్ లు షఫీ, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఫ్లెక్సీ షాప్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**యాదాద్రి భువనగిరి జులై 3 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో శుక్రవారం ప్రభుత్వం విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య శ్రీకాంత్ లక్ష్మి ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి,మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి భాస్కర్, పలువురు కౌన్సిలర్లు, బీర్ మల్లయ్య, మండల, పట్టణ అధ్యక్షులు అశోక్, సాగర్ రెడ్డి, యాదగిరి గుట్ట మండల అధ్యక్షుడు మంగ సత్య నారాయణ,నాయకులు ఏజాజ్, వెంకటేశ్వర రాజు, బుగ్గ నవీన్, కుళ్ళ నర్సింహులు, భాస్కర్ తదితరులు ఉన్నారు.



# ఓటర్ నమోదులో ప్రజలంతా భాగస్వాములు అవ్వాలి

**జవహర్ నగర్ బిఆర్ఎస్ అధ్యక్షులు కొండలు ముదిరాజ్**

**కుషాయిగూడ , మహా :** ఓటర్ నమోదులో ప్రజలంతా భాగస్వాములు అవ్వాలని పారదర్శకతతో కూడిన జాబితా యే లక్ష్యంగా బిఆర్ఎస్ నాయకులు పనిచేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండలు ముదిరాజ్ అన్నారు .ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం జవహర్ నగర్ లో పలు బూత్ లను పార్టీ కార్యకర్తలు తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కొండలు ముదిరాజ్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ ప్రభుత్వ అధికారులతో సవ్యంగా జరుగుతుందని జవహర్ నగర్ లోని ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరు నమోదు ప్రక్రియలో తమ పేరును నమోదు చేసుకొని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని ఆ వజ్రాయుధాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢమిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగన బాలరాజు పటేల్, వెంకటేష్, సోమయ్య, భాస్కర్, కిరణ్, మహిళా కమిటీ సభ్యులు బి ఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు.



# వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం రేగులగూడెం ఉపసర్పంచ్ ఆవుల సత్యనారాయణ కుమార్తె శిరీషనరేందర్ వివాహం శుక్రవారం రేగులగూడెంలో జరిగింది. ఈవేడుకకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై నూతన వధు వరులను ఆశీర్వదించారు. అనంతరం నాయకులతో సర్ సర్వే పై సమీక్షించారు. అర్హులైన ఓటర్ పేరును డిలిట్ కాకుండా బీఎల్ఏ లు జాగ్రత్త వహించాలన్నారు. ఈకార్యక్రమంలో పగడాల మంజుల, బానోత్ రాంమ్మూర్తి నాయక్ , మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, ధారావత్ వినోద్, గుగులోతు భీముడు నాయక్, డీసీసీబీ డైరక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, అడ్డగోడ ఐలయ్య, సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షులు భూక్య రంజీత్ కుమార్, సర్పంచ్ లు ఈసం మోతీరస్వామి, మేదరి వీరప్రతాఫం(టోనీ), బానోత్ హీరాలాల్, పూసం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

# ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకలు చేస్తా...

**ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ**

యాదాద్రి భువనగిరి జులై 3 మహా యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు ఆలేరులో నేషనల్ హైవే మూలంగా అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దృశ్య క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు ఎక్స్ రే, స్కానింగ్ మిషన్ లతోపాటు అన్ని వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు హాస్పటల్లో డాక్టర్లు సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఇక్కడ కొనసాగుతున్న దయాలసిస్ సెంటర్ లో మరో పది బెడ్లను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, Sand చైర్మన్ ఆంజనేయులు, పలువురు కౌన్సిలర్లు, హాస్పటల్ సూపరింటెంట్ స్వప్న రాథోడ్, డ్యూటీ డాక్టర్లు, ఆసుపత్రి స్టాప్ పాల్గొన్నారు.





# యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో, మహా:** యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. టేకులపల్లి మండలంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటించి బొమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలు, 9వ మైలు తండాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం, టేకులపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో పారదర్శకంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి నమోదు అవకాశం కల్పించాలని అన్నారు. బీఎల్‌వోలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజలు పూర్తిగా పూరించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. పాఠశాలల్లో ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం పోషకాహారం స్వచ్ఛమైన తాగునీరు పరిశుభ్రమైన హాస్టల్ వసతులు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థినుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు హాజరు ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం, మండల విద్యాశాఖ అధికారి జగన్, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సర్వేలో గ్రామాల హద్దుల సమస్యల పరిష్కారం

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, మహా :** భూ సర్వేలో గ్రామాల హద్దుల సమస్యల పరిష్కారం పరిష్కారం అవుతుందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహసిల్దార్ మల్లికార్జున్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను చూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మొదటగా గ్రామంలోని భూములకు సంబంధించి హద్దులు నిర్ధారించిన తర్వాతభూమిపై స్పష్టత వస్తుందని, ప్రభుత్వ భూములు సైతం నిర్ధారణ అవుతాయని తెలిపారు. పట్టా కలిగి ఉండి మోకాపై లేకపోవడం, మోకాపై ఉండి పట్టా కలిగి ఉండకపోవడం అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం భూములను ఆక్రమించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో భూ సమస్యలు తలెత్తినట్లయితే న్యాయపరమైన చర్యలకు సులభతరమవుతుందని, మ్యాపింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ చర్యలలో భాగంగా నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, న్యాయపరంగా రావలసిన భూమి అందుతుందని తెలిపారు. భూములలో కబ్జాదారుల జాబితా తయారు చేయడం జరుగుతుందని, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరి చూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దుల నిర్ధారణ జరుగుతుందని, పట్టాలో ఒక సర్వే నెంబరు, మోకాలో ఒక సర్వే నెంబరు అంశాలపై మ్యాపింగ్ ప్రకారం పకడ్బందీగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ తయారు తర్వాత మార్పులు కష్టతరమని, భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ప్రస్తుతం మోకాలో వినియోగిస్తున్న రోడ్డు (దారిని) సైతం మ్యాపింగ్ లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని ఆయన వివరించారు. అనంతరం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని, నాణ్యమైన విద్య అందించే దిశగా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఆ తర్వాత కోటపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి సందర్శించి పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ, విద్య బోధన తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులను అందిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ రికార్డులతో సరి చూసి దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. వివిధ ధ్రువపత్రాల కొరకు కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు దితరులు పాల్గొన్నారు.





# సింగరేణిలో శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణి ప్రధాన కార్యాలయంలో కొలువై ఉన్న దుర్గామాత గుడి నందు శుక్రవారం శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టను అత్యంత వైభముగా నిర్వహించటం జరిగినది. మూడు రోజులపాటు జరిగిన విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో భక్తి శ్రద్ధలతో అధికారులు ఉద్యోగులు ఒప్పంద కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం నిర్వహించిన సహపంక్తి బోజనాలలో కార్పొరేట్ పరిధిలోని అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

# కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి జూలై 2 మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా డిఆర్డిఏ - సేర్ప్ ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో, హెట్రో గ్రూప్ సంస్థల సి ఎస్ ఆర్ నిధుల సహకారముతో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు నిర్వహిస్తున్న 10 రోజుల కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. శిక్షణ కార్యక్రమం రెండవ రోజు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొని శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత వినియోగం వల్ల వ్యవసాయ వ్యయాలు తగ్గడంతో పాటు పనుల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 17 మండలాల నుండి ఎంపికైన 51 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. నిపుణుల బృందం డ్రోన్ ఆపరేషన్, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం తదితర అంశాలపై సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందిస్తోంది. గ్రామీణ మహిళలను సాంకేతికంగా తీర్చిదిద్ది, వ్యవసాయ రంగంలో నూతన ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెట్రో గ్రూప్ సంస్థల సి ఎస్ ఆర్ హెడ్ యన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రవీందర్ పాల్గొని శిక్షణ పొందుతున్న సభ్యులను అభినందించారు. అలాగే అదనపు డి ఆర్ డి ఓ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఏటీఎం ఫార్మ్ జిల్లా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు కూడా పాల్గొన్నారు.



## తోతాపురి రైతులకు కేంద్రం అండ

**ఢిల్లీ, మహా:** ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్న తోతాపురి మామిడి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచింది. వారి కష్టాలను గట్టెక్కించే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించడంతో పాటు, మామిడి ధరలు అమాంతం పడిపోవడానికి గల కారణాలను లోతుగా విశ్లేషించేందుకు భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని కేంద్ర వ్యవసాయ శాఖ తాజాగా ఏర్పాటు చేసింది.ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. తోతాపురి రైతులు ఎదుర్కొంటున్న దుస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. దిగుబడులు చేతికొచ్చినప్పటికీ, మార్కెట్‌లో ధరలు దారుణంగా పతనమవడంతో తాము తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నామని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లి ఆవేదన వ్యక్తం చేశారు. వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో వెంటనే ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పారదర్శకంగానే కుడా భూముల వేలం

- ప్రభుత్వానికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం
- రాజకీయ ఉనికి కోసమే తప్పుడు ప్రచారాలు
- మర్రి యాదవరెడ్డి పై కుడా చైర్మన్ ఇనగాల ఫైర్
- నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా చర్యలు
- కుడా ప్రతిష్టను దెబ్బ తీస్తే సహించం



**మహా వరంగల్ బ్యూరో:** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ భూముల వేలం పై మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి చేసిన అవినీతి ఆరోపణలను కుడా చైర్మన్ డిసిసి అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ఆధారాలు లేకుండా మాట్లాడటం దురదృష్టకరమని అన్నారు. శుక్రవారం హన్మకొండ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలసముద్రం భూముల వేలం ప్రక్రియ పూర్తిగా నిబంధనలకు అనుగుణంగా, అత్యంత పారదర్శకంగా జరిగిందని, దీని ద్వారా ప్రభుత్వానికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం వచ్చిందని ఆయన స్పష్టం చేశారు.

**సమాధానం చెప్పేందుకు నేను సిద్ధం**

మాజీ చైర్మన్ చేసిన ఆరోపణలకు అధికారిక రికార్డులు, వేలం పత్రాలతో సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇనగాల తెలిపారు. ఈ క్రమంలోనే ఆధారాలతో భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లాలని నిర్ణయించు కున్నానని, అయితే రామకృష్ణ కాలనీ వద్ద పోలీసులు తనను అడ్డుకోవడం బాధాకరమన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా పోలీసుల సూచన మేరకు వెనుదిరిగానని, నిజాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. రాజకీయ ఉనికి కోసం భద్రకాళి ఆలయం వద్ద తడిబట్టలతో ప్రమాణాలు చేయడం సరికాదని ఇనగాల తీవ్ర స్థాయిలో విమర్శించారు. నిజంగా అవినీతి జరిగి ఉంటే ఆధారాలను మీడియాకు లేదా దర్యాప్తు సంస్థలకు సమర్పించాలని ఆయన సవాల్ చేశారు. దేవాలయాలను రాజకీయ వేదికలుగా మార్చడం ప్రజల విశ్వాసాలను దెబ్బతీయడమేనని, దేవుడి పేరును రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం తగదని హితవు పలికారు.

**కుడా ప్రతిష్టను దెబ్బతీస్తే సహించం**

కుడా ప్రతిష్టను దెబ్బతీసేలా ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని చైర్మన్ హెచ్చరించారు. వేలానికి సంబంధించిన అన్ని పత్రాలు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నాయని, ఏ విచారణకైనా సిద్ధమని స్పష్టం చేశారు. మీడియా సంస్థలు ధృవీకరించని ఆరోపణలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, వాస్తవాలను ప్రజలకు చేర వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ ఆరోపణలతో అభివృద్ధిని అడ్డుకోలేరని, సత్యమే చివరకు గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వన మహోత్సవ వేడుక

- భావితరాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: జిల్లా కలెక్టర్ దివాకర్.
- మొక్కల విశిష్టతను చాటుతూ సత్తుపల్లి హైవే రోడ్డుపై భారీ ర్యాలీ.
- పర్యావరణ రక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే మట్టా దంపతులు



**సత్తుపల్లి, జూలై 3: మహా :** భావితరాల క్షేమం కోసం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు. శుక్రవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో విద్యార్థులు, యువత, ప్రజలతో జేవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనమహోత్సవ సభలో నిర్వహించిన కార్యమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి ప్రారంబించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో, ఉత్సాహభరితంగా నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఉత్సాహం కలిగించిందని, ప్రజల భాగస్వామ్యం కలిగిన కార్యక్రమాన్ని చూస్తున్నానని సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వనమహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదని, అది ఒక పండుగగా, సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. దీపావళి, దసరా, సంక్రాంతి వంటి పండుగలను ఎలా ఆనందంగా జరుపుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా పండుగలా నిర్వహించా లని పిలుపునిచ్చారు. చరిత్రలో చక్రవర్తి అశోకుడు ఒక వృద్ధుడు మొక్కలు నాటుతున్న దృశ్యాన్ని చూసి, తన కోసం కాకుండా భావితరాల కోసం మొక్కలు నాటుతున్నానన్న ఆ వృద్ధుడి మాటలతో స్ఫూర్తి పొంది తన రాజ్యం అంతటా రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది కోట్లాది మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, యూరప్‌లోని జర్మనీ వంటి దేశాల్లో కూడా తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా రహదారులు దెబ్బతినడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం, విచ్చలవిడిగా వనరులను వినియోగించడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. చెట్లు, పక్షులు, నేల, నీటి వనరులు, జీవ వైవిధ్యాన్ని కాపాడటం ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం అంతే ముఖ్యమని అన్నారు. వనమహోత్సవం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని, ప్రతి పౌరుడు తన ఇంటి వద్ద, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ రోజు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అమూల్యమైన ఆస్తి అని, ప్రకృతిని కాపాడితేనే ప్రకృతిమనలను కాపాడుతుందని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు. అనంతరం జే.వి.ఆర్ కళాశాలలో జిల్లా కలెక్టర్ దివాకర్ తో కలిసి ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆశ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మట్టా దయానంద్ దంపతులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ భాద్యులు మట్టా దయనంద్ ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు కొత్తగా ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం లాంఛనంగా ఆమోదం తెలిపింది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం ఈ నియామకాలకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అధికారికంగా వెల్లడించారు.

**బాధ్యతలు చేపట్టనున్న నూతన న్యాయమూర్తులు**

కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం న్యాయమూర్తులు సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4వ తేదీన జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమోదించింది. అనంతరం ఈ నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిన పిమ్మట తుది అనుమతి కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపింది.
హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో భాగంగా ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) అర్హులైన వారి పేర్లను ప్రతిపాదిస్తారు. ఆ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్ర ప్రభుత్వం వాటిని పరిశీలించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయాన్ని తీసుకుంటుంది. ఈ దశలన్నీ పూర్తయిన తర్వాత ఆ తుది జాబితాకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. ఆ ప్రక్రియ ముగిసిన తర్వాతే కేంద్ర న్యాయశాఖ దీనిపై అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.



## హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్ కారు

# రూ.11 లక్షలకే..

భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్‌లో మరింత మంది వినియోగదారులను ఆకర్షించే లక్ష్యంతో హ్యుందాయ్ మోటార్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. తన ప్రముఖ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ 'క్రెటా ఎలక్ట్రిక్' కోసం బ్యాటరీయాజ్‌ఎసర్వీస్ మోడల్‌ను ప్రవేశపెట్టింది. దీంతో బ్యాటరీ ధరను వాహనం ధర నుంచి వేరు చేయడం ద్వారా క్రెటా ఎలక్ట్రిక్ ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధరను రూ.10.99 లక్షలకు తీసుకొచ్చింది. ఈ కొత్త విధానాన్ని కంపెనీ తాజాగా అధికారికంగా ప్రకటించింది. ఇప్పటివరకు ఎలక్ట్రిక్ కార్ల కొనుగోలులో అధిక ప్రారంభ వ్యయం ప్రధాన అడ్డంకిగా ఉండేది. కొత్త బాస్ మోడల్‌లో వినియోగదారులు కారును తక్కువ ధరకు కొనుగోలు చేసి, బ్యాటరీ కోసం ప్రత్యేకంగా సబ్‌స్క్రిప్షన్ లేదా ఈఎంఐ విధానాన్ని ఎంచుకోవచ్చు. హ్యుందాయ్ తెలిపిన వివరాల ప్రకారం బ్యాటరీ ఈఎంఐ ఖర్చు కిలోమీటరుకు రూ.3.90 నుంచి ప్రారంభమవుతుంది. దీంతో ఒకేసారి పెద్ద మొత్తాన్ని చెల్లించాల్సిన అవసరం తగ్గి, ఈవీ యాజమాన్యం మరింత అందుబాటులోకి వస్తుందని కంపెనీ పేర్కొంది.

**ఫీచర్లలోనూ అప్‌డేట్**

బాస్ మోడల్‌తో పాటు క్రెటా ఎలక్ట్రిక్‌లో కొన్ని కొత్త ఫీచర్లను కూడా హ్యుందాయ్ జోడించింది. అన్ని సంబంధిత వేరియంట్లలో 'ఇంటిగ్రేటెడ్ సైడ్ ఫుట్ స్టెప్' అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో వాహనంలోకి ఎక్కడం, దిగడం మరింత సులభంగా ఉంటుంది. అలాగే వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని హోమ్ ఛార్జర్ వేరియంట్లలో 7.4 కిలోవాట్ల వాల్‌బాక్స్ ఛార్జర్‌ను ప్రామాణికంగా అందిస్తోంది.

**రెండు బ్యాటరీ ప్యాక్‌లు.. 510 కి.మీ వరకు రేంజ్**

క్రెటా ఎలక్ట్రిక్‌లో 42 కిలోవాట్లు, 51.4 కిలోవాట్లు అనే రెండు బ్యాటరీ ప్యాక్ ఎంపికలు కొనసాగుతున్నాయి. పెద్ద బ్యాటరీతో కూడిన లాంగ్‌రేంజ్ వేరియంట్‌కు ఒకసారి పూర్తి ఛార్జ్‌తో గరిష్ఠంగా 510 కిలోమీటర్ల డ్రైవింగ్ రేంజ్ (ARAI సర్టిఫైడ్) లభిస్తుంది. డీసీ ఫాస్ట్ ఛార్జర్‌తో బ్యాటరీని 10 శాతం నుంచి 80 శాతం వరకు కేవలం 39 నిమిషాల్లో ఛార్జ్ చేయవచ్చు. లాంగ్‌రేంజ్ వేరియంట్ 0 నుంచి 100 కిమీ వేగాన్ని 7.9 సెకన్లలో అందుకుంటుంది.

**ప్రీమియం టెక్నాలజీ ఫీచర్లు**

క్రెటా ఎలక్ట్రిక్‌లో వెహికల్‌టులోడ్ (V2L), హ్యుందాయ్ స్మార్ట్ సెన్స్ లెవల్ 2 ADAS, ఐపెడల్ సింగిల్ పెడల్ డ్రైవింగ్, డిజిటల్ కీ, యాక్టివ్ ఎయిర్ ఫ్లాప్స్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. అదనంగా బ్యాటరీపై 8 సంవత్సరాలు లేదా 1.6 లక్షల కిలోమీటర్ల వారంటీ కూడా కంపెనీ అందిస్తోంది.

**ఛార్జింగ్ నెట్‌వర్క్ విస్తరణ**


దేశంలో ఈవీ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు హ్యుందాయ్ తన ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను కూడా వేగంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం 183 ప్రాంతాల్లో 214 డీసీ ఫాస్ట్ ఛార్జర్లు, మొత్తం 399 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే మైహ్యుందాయ్ యాప్‌లోని ఈవీ ఛార్జ్ ఫీచర్ ద్వారా దేశవ్యాప్తంగా 10 వేలకు పైగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ పాయింట్లను వినియోగదారులు గుర్తించి ఉపయోగించుకోవచ్చని తెలిపింది.

# లాంచ్‌కు ముందే అమ్ముడైపోయాయ్!: ధర ఎంతంటే?




ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 'కొడియాక్ ఆర్ఎస్' కారును స్కోడా ఆటో ఇండియా దేశీయ విఫణిలో లాంచ్ చేసింది. దీని ధర రూ. 66.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అయితే కంపెనీ దీనిని సీబీయూ (కంప్లీట్ బిల్ట్ యూనిట్) ద్వారా దిగుమతి చేసుకుంటుంది. స్కోడా లాంచ్ చేసిన ఈ కొత్త కొడియాక్ ఆర్ఎస్ కారు కోసం కంపెనీ బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించిన తరువాత.. ఆరు నిమిషాల వ్యవధిలోనే అన్నీ అమ్ముడైపోయాయి. దీన్నిబట్టి చూస్తే ఇండియన్ మార్కెట్లో దీనికున్న డిమాండ్ ఏంటో స్పష్టంగా అర్థమవుతోంది. స్కోడా కొడియాక్ ఆర్ఎస్ కార్లను కంపెనీ మన దేశానికి కేవలం 50 యూనిట్లను మాత్రమే పరిమితం చేసింది. భవిష్యత్తులో ఈ సంఖ్యను పెంచే అవకాశం ఉందా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. 2.0లీటర్ టర్బోపెట్రోల్ ఇంజన్ ద్వారా పనిచేసే ఈ లేటెస్ట్ మోడల్ 265 హార్స్ పవర్, 400 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇంజిన్ 7స్పీడ్ డ్యూయల్‌క్లచ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ పొందుతుంది. ఆల్‌వీల్‌డ్రైవ్ సిస్టమ్ ద్వారా శక్తి నాలుగు చక్రాలకు డెలివరీ అవుతుంది. స్కోడా కొడియాక్ ఆర్ఎస్ 6.3 సెకన్లలో 0 నుంచి 100 కిమీ/గం వరకు వేగవంతం అవుతుంది. దీంతో ఇది భారతదేశంలో ఇప్పటివరకు లాంచ్ అయిన అత్యంత వేగవంతమైన స్కోడా మోడల్‌గా నిలిచింది. ఆర్ఎస్ వేరియంట్‌లో ప్రోగ్రెసివ్ స్టీరింగ్, 15 అడ్జస్టబుల్ సెట్టింగ్‌లతో కూడిన అడాప్టివ్ డాంపర్‌లు కూడా ఉన్నాయి. ఇవన్నీ మంచి డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుంది. ఇది చూడటానికి స్టాండర్డ్ కొడియాక్ మాదిరిగా కనిపించినప్పటికీ.. కొన్ని అప్‌గ్రేడ్‌లను పొందుతుంది. వీటిలో రీడిజైన్ బంపర్‌లు, ఆర్ఎస్ బ్యాడ్జింగ్, 20 ఇంచెస్ అల్లాయ్ వీల్స్, పెద్ద రూఫ్ స్పాయిలర్, డ్యూయల్ స్టెయిన్‌లెస్ స్టీల్ ఎగ్జాస్ట్ టిప్స్ వంటివి ఉన్నాయి. గ్రిల్, ORVMలు, విండో ఫ్రేమ్‌లు, రూఫ్ రైల్స్, డీపిల్లర్ అంతటా గ్లాస్ బ్లాక్ ఎలిమెంట్స్‌ను ఉపయోగించారు. ఈ SUV వెల్వెట్ రెడ్, మ్యాజిక్ బ్లాక్, మూన్ వైట్, స్టీల్ గ్రే అనే నాలుగు కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. ఫీచర్స్ విషయానికి వస్తే.. కొడియాక్ ఆర్ఎస్ కారులో 12.9అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, ఆర్ఎస్ స్పెషల్ గ్రాఫిక్స్‌తో కూడిన 10.25అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో వస్తుంది. పనోరమిక్ సన్‌రూఫ్, త్రీజోన్ క్లైమేట్ కంట్రోల్, వెంటిలేషన్, హీటింగ్ అండ్ మసాజ్ ఫంక్షన్‌లతో కూడిన పవర్డ్ ఫ్రంట్ సీట్లు, 13స్పీకర్ల కాంటన్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి. సేఫ్టీ కోసం, ఈ SUVలో తొమ్మిది ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ కెమెరా, ఏడీఏఎస్ సిస్టం వంటివి ఉన్నాయి. ఇది ఫోక్స్‌వ్యాగన్ టేరాన్ ఆర్‌లైన్‌కు పోటీగా ఉంది.

# 'అపార్ట్ మెంట్ కొన్నాను.. చింతిస్తున్నాను'



సొంత ఇల్లు అనేది సగటు మధ్యతరగతి భారతీయుడి జీవితకాల కల. కానీ, సరైన ఆర్థిక ప్రణాళిక లేకుండా మారుతున్న ఆదాయ వనరులను అంచనా వేయడంలో పొరపాటుపడితే ఆ కల కాస్తా జీవితాంతం వెంటాడే పీడకలగా ఎలా మారుతుందో వివరించే ఒక తాజా ఉదాహరణ సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ రెడ్డిట్‌లోని 'ఆర్/పర్సనల్ ఫైనాన్స్ ఇండియా' హ్యాండిల్ ద్వారా ఒక వ్యక్తి పంచుకున్న తన అనుభవం నేటి యువతరం ఆలోచింపజేసేదిలా ఉంది. 'ఒక అపార్ట్‌మెంట్ కొన్నాను.. ఇప్పుడు చింతిస్తున్నాను' అనే శీర్షికతో అతను పెట్టిన పోస్ట్ రియల్ ఎస్టేట్ మోజులో పడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వేలాది మంది ఐటీ, కార్పొరేట్ ఉద్యోగుల స్థితికి అద్దం పడుతోంది.

**రూ.25 లక్షల జీతం.. రూ.1.5 కోట్ల ఫ్లాట్!**

ఆ వ్యక్తి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు ఏడాది క్రితం అతను రూ.1.5 కోట్ల విలువైన ఒక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశాడు. 2024లో అతని వార్షిక ఆదాయం దాదాపు రూ.25 లక్షలు. ఆ ధీమాతోనే అతను అంత పెద్ద మొత్తానికి హోమ్‌లోన్ తీసుకున్నాడు. అనుకున్నట్లుగానే 2025లో అతని ఆదాయం రూ.32 లక్షలకు పెరిగింది. అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. ఆ వ్యక్తి వేతన నిర్మాణం స్థిరంగా లేదు. అది పూర్తిగా కమీషన్‌లపై ఆధారపడి ఉంది. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల అతని వ్యాపారం ఒక్కసారిగా దెబ్బతింది. ఫలితంగా అతని నెలవారీ ఆదాయం గణనీయంగా పడిపోయింది.

**ప్రస్తుత పరిస్థితి**

'ఇప్పుడు నా చేతికి వచ్చే జీతం కేవలం హోమ్ లోన్ ఈఎంఐ (ఈఎంఐ), ప్రాథమిక ఖర్చులకు మాత్రమే సరిపోతోంది. నిలదొక్కుకోవడానికి పార్ట్ టైమ్ జాబ్ వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ రోజు స్థిరాస్తి కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేసి ఉంటే బాగుండేది' అని ఆ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

**ఊహించని ఖర్చులు**


రుణ భారం ఒకవైపు వేధిస్తుంటే ఆస్తి కొనుగోలు తర్వాత వచ్చే అదనపు ఖర్చులు అతనిని కోలుకోలేని దెబ్బ తీశాయి. అపార్ట్‌మెంట్ సొసైటీ మెయింటెనెన్స్, ఇతర రిపేర్ల కోసం ఏకంగా రూ.2.5 లక్షలు ఖర్చయింది. ఇంట్లో తలెత్తిన ప్లంబింగ్ లోపాల వల్ల మరో రూ.50,000 అదనపు భారం పడింది. ఇవన్నీ భరిస్తూ రావడం వల్ల అతని వద్ద ఉన్న లిక్విడ్ ఎమర్జెన్సీ ఫండ్ రూ.5 లక్షలకు పడిపోయింది. మ్యూచువల్ ఫండ్స్, పీపీఎఫ్ రూపంలో మరో రూ.10 లక్షల పెట్టుబడులు ఉన్నప్పటికీ అత్యంత క్లిష్ట పరిస్థితి వస్తే తప్ప వాటిని విక్రయించడానికి అతను ఇష్టపడటం లేదు. ఫ్లాట్ కొన్న వెంటనే దాన్ని రీసేల్ చేయడం కష్టమని, ఈ ఊబి నుంచి ఎలా బయటపడాలో అర్థం కావడం లేదంటూ తోటి నెటిజన్లను సలహా కోరాడు.

**నెటిజన్ల రియాక్షన్**

'జరిగిందేదో జరిగింది. ఒకవేళ మీ వ్యాపారం బాగా నడిచి ఉంటే మీరు ఇలా ఆలోచించేవారు కాదు. ఇది కూడా గడిచిపోతుంది. ధైర్యంగా ఉండండి' అని ఒకరు భరోసా ఇచ్చారు. 'నష్టాన్ని తగ్గించుకోవాలంటే వెంటనే ఆస్తిని విక్రయించండి. రీసేల్ మార్కెట్‌లో అపార్ట్‌మెంట్ అమ్మడం కష్టమే. బ్రేక్‌ఈవెన్ (పెట్టిన పెట్టుబడి వస్తే చాలు) స్థాయికి వచ్చినా సరే నష్టాన్ని భరించి ఆస్తిని వదిలించుకుని అప్పు తీర్చండి' అని మెజారిటీ నెటిజన్లు సలహా ఇచ్చారు.

**గుర్తుంచుకోవాల్సిన అంశాలు..**


మీ నెలవారీ నికర ఆదాయంలో హోమ్ లోన్ ఈఎంఐ ఎప్పుడూ 15% నుంచి 20% మించకూడదు. (ఇక్కడ బాధితుడు తన గరిష్ఠ ఆదాయాన్ని బట్టి లోన్ తీసుకుని ఇరుక్కుపోయాడు. వేరియబుల్ లేదా కమీషన్ ఆధారిత ఆదాయం ఉన్నవారు స్థిరమైన ఉద్యోగుల కంటే తక్కువ అప్పు తీసుకోవడం శ్రేయస్కరం. ఇల్లు కొనడమంటే కేవలం రిజిస్ట్రేషన్ ఖర్చే కాదు.. మెయింటెనెన్స్, ఇంటీరియర్, రిపేర్లు వంటి అదనపు ఖర్చుల కోసం కనీసం 5% నిధిని ముందే దాచుకోవాలి. సొంతింటి కల సాకారం చేసుకోవడం తప్పు కాదు కానీ అది మీ ప్రస్తుత ఆర్థిక స్వేచ్ఛను, మనశ్శాంతిని హరించేలా ఉండకూడదు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# రూ. 10 లక్షలకు ముంచేశారు, రోజంతా స్టేషన్‌లోనే : నటి ఆవేదన




నటిగా కెరీర్ ప్రారంభించి, వ్యాపారవేత్తగా అవతరించిన పరుల్ గులాటికి స్వయంగా తన ఉద్యోగుల నుంచే భారీ షాక్ తగిలింది. తనను తాను ముద్దుగా మల్కిన్ అని పిలుచుకునేఈ అమ్మడు ప్రముఖ హెయిర్ ఎక్స్‌టెన్షన్స్ బ్రాండ్ 'నిష్ హెయిర్' అధినేత. తాజాగా బెంగళూరు కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగుల చేతిలో మోసపోయానని వాపోయారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో రోజంతా గడిపినట్లు సోషల్ మీడియాలో వెల్లడించారు.

**ఏం జరిగిందంటే...**

పరుల్ గులాటి తన బ్రాండ్ 'నిష్ హెయిర్' బెంగళూరు శాఖలో జరిగిన భారీ మోసం గురించి ఇన్‌స్టాలో చెప్పుకొచ్చారు. దీని ప్రకారం నిష్ హెయిర్ ఉత్పత్తులను వినియోగదారులకు అమ్మి, వచ్చిన డబ్బును వారి వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. ఇది తెలుసుకున్న తర్వాత, ఆమె బెంగళూరులోని ఒక పోలీస్ స్టేషన్‌లో రోజంతా గడపవలసి వచ్చిందని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడించారు. స్టోర్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఫొటోలను షేర్ చేస్తూ.. బెంగళూరు స్టోర్‌లో ఏదో తప్పు జరుగుతోందని తనకు ముందే అనుమానం వచ్చిందని, దీంతో తాను అకస్మాత్తుగా స్టోర్‌ను సందర్శించినప్పుడు అసలు నిజాలు బయటపడ్డాయని పరుల్ పేర్కొన్నారు. అలాగే సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న యువతికి స్టోర్ సీసీటీవీ యాక్సెస్ ఉందని అందుకే తాను బెంగళూరు వస్తున్న విషయం తెలుసుకుని, తాను రాకముందే ఒంట్లో బాగోలేదంటూ సెలవు పెట్టి తప్పించుకుంది. ఇలా రోజుకు దాదాపు రూ.15,000 నుండి రూ. 20 వేల దాకా నొక్కేశారు. పరుల్ వచ్చిన రోజు డ్యూటీలో ఉన్న స్టోర్ మేనేజర్‌ను నిలదీయడంతో అతను మోసం చేసినట్లు అంగీకరించాడు. ఉద్యోగంలో చేరిన మొదటి నెల మొత్తం బిజినెస్ ఎలా నడుస్తుందో అర్థం చేసుకున్నానని, రెండో నెల నుంచే ఈ మోసానికి తెరలేపానని అతను ఒప్పుకున్నట్లు పరుల్ చెప్పారు.

**రూ.10 లక్షల స్టాక్ మాయం**

గత నెలలో తమ ఇన్వెంటరీ (స్టాక్) లెక్కలు చూసినప్పుడు దాదాపు రూ.10 లక్షల విలువైన ప్రొడక్ట్స్ తక్కువగా ఉన్నట్లు గుర్తించామని పరుల్ చెప్పారు. 'షాపిఫై' (Shopify) యాప్‌లో లెక్కలు సరిచేస్తున్నట్లు కనిపించినా, తాను పంపిన అసలు స్టాక్‌కు, అమ్మకాలకు పొంతన కుదరక పోవడంతో అనుమానం బలపడిందని అన్నారు. తన ప్రొడక్ట్‌స్‌ని, ప్యాకేజింగ్‌నువాడుకొని, తనను, తన కస్టమర్లను కూడా మోసం చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

**పరుల్ గులాటి విజ్ఞప్తి**


ప్రస్తుతానికి కేవలం గత 6 నెలల కాలానికి సంబంధించిన ఆధారాలు మాత్రమే తన వద్ద ఉన్నాయని పరుల్ తెలిపారు. మేనేజర్ ఒక్కడే దాదాపు రూ.8 లక్షల వరకు కాజేసినట్లు ఒప్పుకున్నాడని, ఆ సేల్స్ ఎగ్జిక్యూటివ్ యువతి మాత్రం ప్రస్తుతం పరారీలో ఉందని పేర్కొన్నారు. పోగొట్టుకున్న డబ్బు తిరిగొస్తుందనే నమ్మకం తనకు లేదని, కానీ ఇలాంటి మోసగాళ్లను ఎవరూ కూడా ఉద్యోగాల్లోకి తీసుకోకూడదనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటపెడుతున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలోఅప్రమత్తంగా ఉండాలని తన కస్టమర్లకు విజ్ఞప్తి చేశారు.

# లాకప్ డెత్ కేసులో కోర్టు సంచలన తీర్పు



**ముంబై:** సుదీర్ఘ కాలం పాటు సాగిన ఒక కస్టోడియల్ డెత్ కేసులో మహారాష్ట్రలోని వాషిమ్ జిల్లా, సెషన్స్ కోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల క్రితం 23 ఏళ్ల యువకుడి లాకప్ డెత్‌కు కారణమైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ సహా తొమ్మిది మంది పోలీసులకు న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది. 2011, మే 10వ తేదీ అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో పార్ధి సామాజిక వర్గానికి చెందిన బేగ్యా పవార్ (23) అనే యువకుడిని విచారణ నిమిత్తం పోలీసులు వారి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆ మరుసటి రోజు ఉదయమే పవార్ పోలీస్ కస్టడీలోనే మరణించినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. పోలీస్ స్టేషన్‌లో పవార్‌ను తీవ్రంగా చిత్రహింసలకు గురిచేయడం వల్లే అతను ప్రాణాలు కోల్పోయాడని బాధితుడి తల్లిదండ్రులు ఆరోపించారు. వైద్య పరీక్షలలో కూడా పవార్ శరీరంపై అనేక చోట్ల ఎముకలు విరిగినట్లు తేలడంతో, కస్టడీలో జరిగిన హింస నిజమేనని స్పష్టమైంది. ఘటన జరిగిన అనంతరం పవార్ తల్లిదండ్రులు అదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించారు. అయితే అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌పైనే ఆరోపణలు ఉండటంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి నిరాకరించారు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, పార్ధి సామాజిక వర్గ ప్రజలు పోలీస్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆందోళనల నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును రాష్ట్ర సీఐడీకి అప్పగించింది. సీఐడీ దర్యాప్తు అధికారి లోతుగా విచారణ జరిపి, కస్టడీలో యువకుడిని తీవ్రంగా కొట్టడం వల్లే మరణించాడని నిర్ధారిస్తూ కోర్టులో నివేదిక (చార్జ్‌షీట్) దాఖలు చేశారు. గత 15 ఏళ్లుగా సాగిన ఈ కేసు విచారణ చివరకు ముగిసింది. నాటి రిసోడ్ పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ మహాదేవ్ మాణిక్ ధాండేతో పాటు మరో ఎనిమిది మంది పోలీసులను కోర్టు దోషులుగా తేల్చింది. నిందితుల్లో ఇన్‌ఛార్జ్ ధాండేతో సహా ఇద్దరు పోలీసులు ఇప్పటికే సర్వీస్ నుండి రిటైర్ అయ్యారు. కాగా, కోర్టు తీర్పు వెలువరించిన వెంటనే దోషులైన తొమ్మిది మందిని వాషిమ్ జైలుకు తరలించారు. అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తయిన తర్వాత వారిని అమరావతి జైలుకు తరలించనున్నారు. కోర్టు తీర్పుపై పవార్ వృద్ధ తల్లిదండ్రులు స్పందిస్తూ..15 ఏళ్ల నిరీక్షణ తర్వాత మాకు న్యాయం జరిగింది అని ఆవేదనతో కూడిన ఆనందాన్ని వ్యక్తం చేశారు. నాటి ఘటనను గుర్తుచేసుకుంటూ.. తన కొడుకు ఎలాంటి నేరం చేయలేదని, కేవలం ప్రశ్నించడానికే తీసుకెళ్లి చంపేశారని పవార్ తల్లి కన్నీరు మున్నీరైంది. నిందితులకు శిక్ష పడేలా శ్రమించిన కోర్టుకు, ప్రాసిక్యూషన్‌కు, సీఐడీ దర్యాప్తు బృందానికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అయోధ్యరాముడి విరాళాల గోల్‌మాల్



అయోధ్య రామాలయంలో విరాళాల గోల్ మాల్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలన రేపింది. దీనిపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఇప్పటికే అనేక షాకింగ్ విషయాలను వెల్లడించింది. విరాళాల మాయంపై వస్తున్న ఆరోపణలపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందిఅయోధ్యలోని రామమందిరంలో హుండీ సొమ్ము దొంగతనానికి గురైన ఘటన తమను ఎంతో కలచి వేసిందని, తీవ్ర ఆవేదనకు గురిచేసిందని ఆర్ఎస్ఎస్ తెలిపింది.. ఈ దురదృష్టకర సంఘటన హిందూ సమాజంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది శ్రీరాముని భక్తుల మనోభావాలను, విశ్వాసాన్ని తీవ్రంగా గాయపరిచిందని ఆర్ఎస్ఎస్ పేర్కొంది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అభ్యర్థన మేరకు ఇప్పటికే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (SIT) ఏర్పాటు చేసిందని, వారి సిఫార్సుల ఆధారంగా చట్టపరమైన చర్యలు ప్రారంభించిందని ఆర్ఎస్ఎస్ గుర్తుచేసింది. ఈ విచారణలో నిందితులుగా తేలిన వారెవరినైనా సరే చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

**ఆలయ నిర్వహణ మారాలి**

ఆర్ఎస్ఎస్ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ ఘటనను ఒక ఎక్సెప్షనల్ విషయంగా పరిగణించాలని ఆర్ఎస్ఎస్ కోరింది. ఆలయ పరిపాలన, నిర్వహణ లోపాలన్నింటినీ సరిదిద్దడానికి తక్షణమే సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని కోట్లాది భక్తులకు అయోధ్య ఆలయంపై ఉన్న నమ్మకం, భక్తి ఏమాత్రం సడలకుండా చూడాల్సిన బాధ్యత ట్రస్ట్‌పై ఉందని పేర్కొంది. ఈ విషయంలో ప్రస్తుతం నెలకొన్న గందరగోళం, అనిశ్చితికి వెంటనే ముగింపు పలకాలని కోరింది.

**హిందూ ధర్మాన్ని అప్రతిష్ట పాలు చేసే కుట్ర: దత్తాత్రేయ హోసబాలే**

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి (జనరల్ సెక్రటరీ) దత్తాత్రేయ హోసబాలే శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రామాలయంలో విరాళాల దొంగతనం సమాజాన్ని తీవ్రంగా బాధించిందన్నారు. అంతేకాకుండా, ఈ సంఘటనను ఆసరాగా చేసుకుని "హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు" హిందూ ధర్మానికి చెడ్డపేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయని హోసబాలే ఆరోపించారు. అందువల్ల సమగ్ర విచారణ జరిపి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా ఆలయంలోని కౌంటింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకుని, అక్కడి ఉద్యోగులే డబ్బులను చాకచక్యంగా తస్కరించి, ఆ తరువాత ఎవరికీ అనుమానం రాకుండా ఆలయ ప్రాంగణంలోని వాష్‌రూమ్‌లలో దాచిపెట్టి, సీసీటీవీకి చిక్కకుండా గుట్టుచప్పుడు కాకుండా బయటకు తీసుకెళ్లేవారని సిట్ విచారణలోనిందితులు తెలిపారు. అనేక సంచలన విషయాలు వెలుగులోకి రావడంతో సిట్ దర్యాప్తు వేగవంతమైంది. జూలై 15లోగా ప్రభుత్వం ముందుకు పూర్తి నివేదిక సమర్పించనుంది.



## సర్వం మాయ భామకు
# వరుస అవకాశాలు


హీరోయిన్లకు భాషతో సంబంధం లేదు. ఒక భాషకు చెందిన వారు మరొ దానిలో నటిస్తూ గుర్తింపు తెచ్చుకుంటూ ఉంటారు. నయనతార స్వతహాగా మలయాళీ అయినప్పటికీ తమిళంలో బోలెడంత గుర్తింపు తెచ్చుకుని చెన్నైలోనే సెటిల్ అయిపోయింది కూడా. ఇప్పుడు ఈ లిస్టులోకి మరో మలయాళీ బ్యూటీ చేరేందుకు రెడీ అయింది. ఆమెనే రియా షిబు. మొదట నటిగా ఆకట్టుకున్న ఈమె.. నిర్మాతగా మారి తమిళంలో విక్రమ్‌తో 'వీర ధీర సూరన్' సినిమాని నిర్మించింది. తర్వాత కథానాయకగా అవతారమెత్తి 'సర్వం మాయ' అనే మలయాళ చిత్రంలో నటించి మంచి విజయాన్ని అందుకుంది. ఇలా పలు రంగాల్లో ప్రతిభ చాటుకుంటున్న రియా.. కోలీవుడ్ దర్శక నిర్మాతల దృష్టిలో పడింది. విక్రమ్ హీరోగా చేస్తున్న కొత్త మూవీలో హీరోయిన్‌గా అవకాశం వరించింది. ఆనంద్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అలా ఉండగానే ఇప్పుడు మరో అవకాశం తలుపు తట్టిందని సమాచారం.

విజయ్ సేతుపతితో రియా కలిసి నటించడానికి సిద్ధమవుతోందని తెలిసింది. క్రితిక ఉదయనిధి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మహిళ దర్శకురాలు ఈసారి కుటుంబ అనుబంధాలతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్ తీయబోతున్నట్లు సమాచారం. ఈ చిత్ర షూటింగ్ ఇటీవల ప్రారంభమై ఎలాంటి ఆర్భాటాలు లేకుండా చిత్రీకరణను జరుపుకొంటున్నట్లు, మరో వారంలో తొలి షెడ్యూల్ పూర్తికాబోతున్నట్లు తెలిసింది. ఈ చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తోంది.



## షూటింగ్ చేస్తూ ఎంబీబీఎస్ పరీక్షలు రాశా: టాలీవుడ్ హీరోయిన్


డాక్టర్ అవ్వాల్సింది అనుకోకుండా యాక్టర్ అయ్యాను.. సినిమా ఇండస్ట్రీలోని స్టార్ హీరోయిన్ల నుంచి తరచూ వినిపించే మాట ఇది. అయితే ఈ ముద్దుగుమ్మ మాత్రం సినిమా లు చేస్తూనే ఎంబీబీఎస్ చేసింది. షూటింగ్ లకు హాజరవుతూనే పరీక్షలు రాసింది. సినిమాలు చేసినా ఎంబీబీఎస్ చదువే తన తొలి ప్రాధాన్యమన్న ఆ హీరోయిన్ మరెవరో కాదు లేటెస్ట్ సెన్సేషన్ శ్రీలీల. ఇటీవల 'డాక్టర్స్ డే' సందర్భంగా మాట్లాడిన శ్రీలీల 'వైరల్ వయ్యారి' పాట చిత్రీకరణ జరుగుతున్న సమయంలో కూడా ఎంబీబీఎస్ పరీక్షలకు ప్రాధాన్యం ఇచ్చానంది. 'డాక్టర్ కావడం నా చిన్ననాటి కల. అందుకే షూటింగ్ సమయంలో కూడా నా ఎంబీబీఎస్ పరీక్షలకే మొదటి ప్రాధాన్యం ఇచ్చాను'. 'షూటింగ్ పూర్తయ్యాక వెంటనే ప్రాక్టికల్స్‌కు వెళ్లేదాన్ని. మధ్యలో గ్యాప్ దొరికితే మళ్లీ సెట్స్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొనేదాన్ని'. 'ఇది అంత సులభం కాదు. కానీ వైద్య విద్య నాకు ఎంతో విలువైనది. అందుకే కష్టమైనా రెండింటినీ బ్యాలెన్స్ చేశా' అని శ్రీలీల చెప్పింది. శ్రీలీల చెబుతోన్న 'వైరల్ వయ్యారి' పాట 'జూనియర్' సినిమాలోనిది. ఈ చిత్రంలో కీరీటి రెడ్డి హీరోగా నటించాడు. ఈ పాటలో శ్రీలీల స్టెప్పులు ఓ రేంజ్ లో ఉంటాయి.సమంత ప్రధాన పాత్రలో నటించిన మా ఇంటి బంగారం సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకెళ్లిపోతోంది. జున్ 19న విడుదలైన ఈ సినిమా ఇప్పటివరకు రూ. 70 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది.జయపజయాలతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తోంది టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల.పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏపీ డిప్యూటీ సీఎంగా కీలక భాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడాయన సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చారు.మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం 'పెద్ది' సినిమా షూటింగ్ పనుల్లో బిజీ బిజీగా ఉంటున్నాడు. బుచ్చిబాబు ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు.మా ఊరి పొలిమేర సినిమాతో తెలుగు ఆడియెన్స కు బాగా దగ్గరైపోయింది కామాక్షి భాస్కర్ల. ఇందులో ఆమె అభినయం అందరినీ ఆకట్టుకుంది.సినిమా ఇండస్ట్రీలో అతి సుదీర్ఘ కాలం పాటు హీరోయిన్ గా చేస్తోన్న ముద్దుగుమ్మల్లో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒకరు.



## బిగ్‌బాస్ ఛాన్స్ రిజెక్ట్..
# హీరోయిన్‌గా క్రేజ్

రెండు తెలుగు రాష్ట్రాల్లో తన ఫోక్ సాంగ్స్, అద్భుతమైన డ్యాన్స్‌తో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న ఫోక్ బ్యూటీ నాగదుర్గ. యూట్యూబ్ లో ఫోక్ సాంగ్స్ ద్వారా పాపులర్ అయిన ఈ అమ్మడు త్వరలోనే వెండితెరపై హీరోయిన్‌గా పరిచయం కాబోతున్న సంగతి తెలిసిందే.బలగం ఫేమ్ ప్రియదర్శి హీరోగా నటిస్తున్న 'ఇడుపు కాయితం' సినిమాలో ఆమె పూర్తి స్థాయి కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవలే ఈ మూవీ స్టార్ట్ అయ్యింది.ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం గురించి, గతంలో తాను వదులుకున్న స్టార్ హీరోల సినిమా అవకాశాల గురించి పంచుకున్నారు.తాను హీరోయిన్ కాకముందే టాలీవుడ్‌లో భారీ ఆఫర్లు వచ్చాయని ఆమె వెల్లడించారు. నేచురల్ స్టార్ నాని నటించిన సూపర్ హిట్ సినిమా 'శ్యామ్ సింగరాయ్'లోసాయి పల్లవి పాత్రకు సహచరిగా, క్లాసికల్ టచ్ ఉన్న ఒక ముఖ్యమైన పాత్ర కోసం మేకర్స్ మొదట నాగదుర్గను సంప్రదించారు. అలాగే పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్కలిసి నటించిన బ్రో సినిమాలో, అశోకవనంలో అర్జున కళ్యాణం వంటి సినిమాలతోపాటు పలు సీరియల్స్ లో కూడా ఛాన్స్ వచ్చినా రిజెక్ట్ చేశానని అన్నారు.అలాగే తనకు బిగ్ బాస్ షోలో ఛాన్స్ వచ్చిందని.. కొన్ని కారణాలతో ఆ అవకాశం వదులుకున్నానని అన్నారు. ప్రస్తుతం ఇడుపు కాయితం చిత్రంలో నటిస్తుంది.

## ప్రజలు గమనిస్తున్నారు.. ఇవన్నీ దేనికి?



యూట్యూబర్ జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్ అరెస్ట్ వ్యవహారం సంచలనంగా మారింది. హైదరాబాద్‌లో రావణ్‌ని అరెస్ట్ చేసిన ఆంధ్రప్రదేశ్ పోలీసులు.. అతడిని కాకినాడ జిల్లా పిఠాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే విచారణ తర్వాత పిఠాపురంలో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేశారు. ఈ క్రమంలోనే వెంటనే మరో కేసులో రావణ్‌ని సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత వైద్య పరీక్షల కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించేందుకు ప్రయత్నించగా తీవ్ర హైడ్రామా నెలకొంది. ప్రస్తుతం రావణ్‌ని మచిలీపట్నం తరలించారు. ఇక రావణ్ అరెస్ట్ వివాదంపై ఓ వీడియో విడుదల చేసిన ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్.. ఈ సిగ్గులేని కక్షసాధింపు చర్యలెందుకు? అని ప్రశ్నిస్తూ యూట్యూబర్ ప్రశ్న రావణ్‌పై వరుస కేసులు పెట్టడాన్ని తప్పు పట్టాడు. ఈ కేసులో అరెస్ట్ చేయలేమని కోర్టులు బెయిల్ ఇస్తున్నా మరో కేసు వేసి మళ్లీ అరెస్ట్ చేస్తున్నారు. ఓ 30 కేసులు రెడీగా ఉన్నాయంట కదా? ఇలా అధికారాన్ని దుర్వినియోగంతో ఎంత దూరం వెళ్తారు? ఈ సిగ్గులేని కక్షసాధింపు చర్యలు దేనికి? ప్రజలు గమనిస్తున్నారు. త్వరలో రావణ్‌ని వదిలేస్తారని ఆశిస్తున్నా అని సోషల్ మీడియాలో వీడియోని పంచుకున్నారు.

## ఆరెంజ్ డ్రెస్‌లో అందంగా.. గ్లామర్ బ్యూటీ అందాల సెగలు



టాలీవుడ్ క్రేజీ గ్లామర్ బ్యూటీ సోనాల్ చౌహాన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ ముద్దుగుమ్మ అందానికి ఎవ్వరు అయినా సరే ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన అందంతో ఆకట్టుకుంటుంది. రెయిన్ బో అనే సినిమాతో తెలుగు అభిమానుల ముందుకు వచ్చిన ఈ చిన్నది మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించుకుంది. తన అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకుంది.

### రెయిన్ బో

ఈ మూవీ తర్వాత ఈ బ్యూటికి చాలా అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా బాలకృష్ణ సరసన లెజెండ్ మూవీలో నటించింది. ఈ మూవీతో సూపర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది.

### లెజెండ్

దీని తర్వాత ఈ చిన్నదానికి తెలుగులో ఆశించిన మేర అవకాశాలు రాలేదు, పలు సినిమాల్లో నటించినప్పటికీ, అవి అంతగా గుర్తింపు తీసుకరాలేదనే చెప్పాలి.

### సినిమాలు

ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగులో కాకుండా బాలీవుడ్, కోలీవుడ్‌లో వరసగా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీ బిజీగా గడిపేస్తున్నట్లు తెలుస్తుంది.

### వరస సినిమాలు

అంతే కాకుండా తెలుగులో కూడా ఓ సినిమా చేస్తుందంట. అతి త్వరలో బాలయ్య సరసన నటించి, మరో సినిమాతో అభిమానులను ఆకట్టుకోనున్నదంట.

### తెలుగు

ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఈ బ్యూటీ తాజాగా అదిరిపోయే ఫొటోలను తన ఇన్ స్టాలో షేర్ చేసింది ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

### యాక్టివ్

కాషాయం రంగు డ్రెస్‌లో తన అంద చందాలతో ఈ బ్యూటీ ప్రతి ఒక్కరి మనసు దోచేసుకుంటుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

## పాన్ ఇండియా స్థాయిలో
# వనజీవి రామయ్య



కోటి మొక్కల రామయ్యగా ప్రసిద్ధి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి దరిపల్లి రామయ్య జీవిత కథ 'వనజీవి రామయ్య' పేరుతో వెండితెరపైకి రానుంది. బ్రహ్మాజీ టైటిల్ రోల్‌లో, నాగరాణి హీరోయిన్‌గా నటిస్తున్నారు. వేముగంటి దర్శకత్వంలో నిడిగొండ నరేష్ కుమార్ ప్రజాపతి నిర్మిస్తున్నారు. జూలై 1న దరిపల్లి రామయ్య జయంతిని పురస్కరించుకుని మూవీ టీమ్, వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనజీవి అవార్డు పురస్కార మహోత్సవం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సేవకులను సత్కరించారు. ''వనజీవి రామయ్య' ని పాన్ ఇండియా స్థాయిలో పూర్తి స్థాయి ఫీచర్ ఫిల్మ్‌గా నిర్మిస్తున్నాం'' అని నిడిగొండ నరేష్ ప్రజాపతి, దర్శకుడు వేముగంటి తెలిపారు.

## కాక రేపుతున్న కాయదు

ప్రెజెంట్ యూత్ క్రష్‌కాయదు లోహర్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయం అవసరం లేదు.. ఈ ముద్దుగుమ్మ 2000 ఏప్రిల్ 11న అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించింది. 2021లో పూణే ఫ్రెష్ ఫేస్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచింది కాయదు లోహర్, ఇదే ఆమెకు సినిమా అవకాశాలను తెచ్చిపెట్టింది. 2021లో కన్నడ చిత్రం "మొగిల్‌పేట"తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. "పాథోన్‌పథం నూట్టండు" (2022) చిత్రంతో మలయాళంలో సూపర్ హిట్ అందుకుంది.తాజాగా వచ్చిన డ్రాగన్ సినిమాతో బాగా పేరు తెచ్చుకుంది. ఈ చిత్రంలో కాయదు గ్లామర్ తో కుర్రకారు గుండెల్లో సెగలు రేపింది.ప్రస్తుతం తెలుగు, మరాఠీ, తమిళ్ చిత్రాల్లో బిజీ అయ్యిపోయింది. "థారం" మరియు "ఇధయం మురళి" వంటి చిత్రాలతో మరింత బిజీగా ఉంది ఈ ముద్దుగుమ్మ. గ్లామరస్ ఫోటోలతో సోషల్ మీడియాలో షేర్ చేస్తూ యాక్టివ్‌గా ఉంటూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది ఈ చిన్నది.తాజాగా ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియా లో షేర్ చేసిన ఫోటోస్ క్రేజీ కామెంట్స్ తో ఫుల్ వైరల్ అవుతున్నాయి.



## సినిమాల జోరు తగ్గించిన అందాల భామ

కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ముద్దుగుమ్మల్లో ఆషికా రంగనాథ్ ఒకరు. ఈ బ్యూటీ తన అందంతో ఎంతో మంచి కుర్రాళ్లను కట్టిపడేసింది. కన్నడ, తమిళ, తెలుగు భాషా చిత్రాలలో నటిస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది ఆషికా రంగనాథ్. చేసింది తక్కువ సినిమాలే కానీ క్రేజ్ మాత్రం ఫుల్. ఆమె 2016 చలనచిత్రం క్రేజీ బాయ్, రాంబో 2లలో ప్రధాన పాత్రలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది ఆషికా రంగనాథ్.నాగార్జున నటించిన నా సామిరంగ సినిమాతో హిట్ అందుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాలో నటించింది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమాలో హీరోయిన్ గా చేస్తుంది. ఈ సినిమా తప్ప మరో సినిమా అనౌన్స్ చేయలేదు. ఈ ముద్దుగుమ్మ బడా సినిమా ఆఫర్స్ కోసం ఎదురుచూస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com